Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 353 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 జనవరి 2024 శుక్రవారం పేజీలు : 4

### కర్ణాటక నుంచి అయోధ్యకు 11 ప్రత్యేక రైళ్లు.. గోవా నుంచి మరో రెండు

బెంగళూరు : అయోధ్యలో నిర్మించిన చారిత్రాత్మక రామాలయాన్ని దర్శించుకునే భక్తుల కోసం రాష్ట్రం నుంచి 11 ప్రత్యేక రైళ్లు ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీరామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 22న జరగనుంది. బాలరామ (రామలల్లా) విగ్రహాలకు పూజలు చేసి రామమందిరాన్ని దర్శించుకునేందుకు కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రం నుంచి 11 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కర్ణాటక – గోవా నుంచి రెండు రైళ్లు బయల్దేరనుండగా, కర్ణాటక నుంచి అయోధ్యకు నేరుగా మిగిలిన 9 రైళ్లు సంచరించనున్నాయి. ఈనెల 31 తర్వాత ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆన్‌లైన్ ద్వారా టికెట్లను బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించింది.

# చేసిన పనులను చెప్పుకోవడంలో...

# విఫలమయ్యాం



## పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేస్తే మేమే గెలిచే వాళ్లం : కేటీఆర్

హైదరాబాద్ : ప్రజలు మనకు పదేళ్లు అవకాశం ఇచ్చారు. అధికారంలోకి వస్తాం అని కాంగ్రెస్ పార్టీ వాళ్లు కూడా అనుకోలేదు. నోటికి ఏది వస్తే అది హామీలుగా ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలోఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అన్నారు.

కానీ 420 హామీలిచ్చారు. కాంగ్రెస్ వాళ్ల తప్పుడు ప్రచారం నమ్మి ప్రజలు గొప్పగా పని చేసిన నాయకులను కూడా తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు ఇవ్వలేదు అని తప్పుడు ప్రచారం చేశారు. ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపంచారు. తొమ్మిదన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 6,47,479 రేషన్ కార్డులు ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. అంతేకాదు దేశంలో అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మేము ఏనాడు చెప్పుకోలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు సైతం అత్యధిక వేతనాలు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ మేము చెప్పుకోలేదు, ప్రచారం చేసుకోలేదన్నారు.

**చెప్పుకోవడంలో విఫలమయ్యాం..** దేశంలో అందరికన్నా ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులకు 73% జీతాలు పెంచిన ఏకైక నాయకుడు కేసీఆర్. 29 లక్షల ఫించన్లను 46 లక్షలకు పెంచినా ఏనాడు చెప్పుకోలేదని గుర్తు చేశారు.

దేశంలో అందరికన్నా ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది తెలంగాణ ప్రభుత్వమే కానీ ఇలాంటి అనేక అంశాలను చెప్పుకోవడంలో విఫలమయ్యాం. అందుకే కాంగ్రెస్ పార్టీ అబద్ధాల ముందు అభివృద్ధి ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే మేమే గెలిచే వాళ్లం అన్నారు.

**ప్రజలను లైన్‌లలో నిలబెట్టలేదు..** వందలాది సంక్షేమ కార్యక్రమాలు మన ప్రభుత్వ హయాంలో అమలు చేసినా, ఏనాడు కూడా ప్రజలను లైన్‌లలో నిలబెట్టలేదు. ప్రజల సౌకర్యమే చూసాము కానీ రాజకీయ ప్రయోజనం, రాజకీయ ప్రచారం గురించి ఏనాడు ఆలోచించలేదన్నారు. ప్రజలు మనల్ని పూర్తిగా తిరస్కరించలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి మూడో వంతు సీట్లు 39 వచ్చాయి. 14 స్థానాల్లో ఓటమి కేవలం గరిష్ఠంగా 6 వేల ఓట్ల తోనే జరిగింది. మొత్తంగా కాంగ్రెస్ పార్టీకి మనకు తేడా కేవలం 1.85 శాతమేనని స్పష్టం చేశారు.

**మహబూబ్‌బాద్ గెలుపే మనకు సోపానం..** స్థానిక సంస్థల నుంచి మెదలుకొని, అసెంబ్లీ దాకా బలమైన నాయకత్వం మనకున్నది. బలమైన ప్రతిపక్షం మనది. అన్నిటికి మించి కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడు మనకున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలే మన గెలుపునకు సోపానం కావాలన్నారు. ఎన్నికల ముందు రైతు రుణమాఫీ చేస్తామంటూ రేవంత్ రెడ్డి అనేక మాటలు మాట్లాడారు. రుణం ఉన్నవాళ్లే కాదు, వ్యవసాయ రుణం లేనివాళ్లు కూడా తీసుకోండని సూచించారు. అధికారంలోకి రాగానే వెంటనే రుణమాఫీ చేస్తామన్నారు. ఇచ్చిన అడ్డగోలు హామీలను నెరవేర్చే దారిలేకనే అప్పులంటూ, శ్వేతపత్రాలంటూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

**అందరినీ కలుపుకుపోతాం..** ఎవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు. ఇలాంటి పార్టీ సమావేశాలను వరుసగా పెట్టుకుందాం. అనుబంధ సంఘాలను బలోపేతం చేసుకుందామన్నారు. పార్టీకి అన్ని వర్గాలను దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. గిరి జనులకు స్థానిక సంస్థల రిజర్వేషన్ తో పాటు.. పోడు భూముల పట్టాల పంపిణీ, అనేక ఇతర సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో కొనసాగించింది. అయినా గిరిజనులు ఎక్కువ ఉన్న చోట్లకూడా ప్రజలు పూర్తి మద్దతు మనకివ్వలేదన్నారు. ఇలాంటి వాటన్నింటిపై ఆత్మవిమర్శ చేసుకుని ముందుకుపోదామని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

## కాళేశ్వరం, మేడిగడ్డ అంశంలో కాంగ్రెస్‌కు బండి సంజయ్ కౌంటర్

కరీంనగర్: అయోధ్య రామ మందిరంపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రతీ భారతీయుడు పాల్గొనాల్సిన చారిత్రక, ధార్మిక కార్యక్రమమిది అని అన్నారు. అయోధ్య కాంగ్రెస్ ఇలా ఎందుకు వ్యవహరిస్తుందో తెలియడం లేదన్నారు. కాగా, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బండి సంజయ్ కరీంనగర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. అయోధ్య రాముడు భారతీయ జనతా పార్టీకి మాత్రమే రాముడు కాదు, అందరివాడు. అయోధ్య రామమందిరాన్ని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఎందుకు వ్యతిరేకిస్తుందో అర్థం కావడం లేదు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రతి భారతీయుడూ పాల్గొనాల్సిన చారిత్రక, ధార్మిక కార్యక్రమం అది.

ఎవరు ఎవరి బినామీలో అందరికి తెలుసునంటూ మాజీ ఎంపీ వినోద్‌కు కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ బినామీలమైతే సీబీఐ విచారణ మేమే ఎందుకు కోరతాం?. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేయాలని కాంగ్రెస్ ఎందుకు కొరడం లేదు?. కేవలం మేడిగడ్డపైనే ఎందుకు విచారణ కోరింది?. మీరు, మేము ఇద్దరం కలిస్తేనే బీఆర్ఎస్ అవినీతి బయటకు వస్తుంది. నేటి యువతని మద్యానికి, డ్రగ్స్‌కు కొన్ని పార్టీలు బానిసలు చేస్తున్నాయి. కాలేజీలను అడ్డాలుగా చేసుకుని డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

## లోక్‌సభ బరిలో ఈటల: రేవంత్ రెడ్డి స్థానంపై కన్ను

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల గడువు సమీపించింది. ఇంకో రెండు నెలల్లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ ఎన్నికలను ఎదుర్కొనడానికి ముమ్మర కసరత్తు సాగిస్తోన్నాయి. గెలుపు గుర్రాల వేటలో పడ్డాయి. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. అత్యధికం బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నాయి. తొమ్మిది స్థానాల్లో గులాబీ జెండా ఎగురుతోంది. నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో మూడింటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఏఐఎంఐఎం ఒక స్థానాన్ని నిలబెట్టుకుంది. రీల్స్ చెయ్యకూడదని చెప్పిన భర్తను చంపేసిన భార్య, సోషల్ మీడియాలో రచ్చరచ్చ! ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది బీజేపీ. 17 లోక్‌సభ నియోజకవర్గాలకూ రాజకీయ ఇన్‌ఛార్జిలను ప్రకటించింది. శాసన సభ, శాసన మండలి సభ్యులకు ఈ బాధ్యతలను అప్పగించింది. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పార్టీ స్థితిగతులపై అధ్యయనం చేయడం, సమర్థుడైన అభ్యర్థి పేరును వాళ్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చవి చూసిన బీజేపీకి చెందిన కొందరు సీనియర్ నేతలు లోక్‌సభ బరిలో నిల్చోవడం ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డి- తనకు



అచ్చి వచ్చిన సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి ఎన్నికల్లో పోటీ చేయబోతోన్నారు. ప్రస్తుతం ఆయన ఇదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యాన్ని వహిస్తోన్నారు. నకిలీ జీవోలతో రూ. 5 కోట్ల మోసం: బీఆర్ఎస్ నేత అరెస్ట్ బీజేపీకే చెందిన మరో సీనియర్ నేత ఈటల రాజేందర్.. లోక్‌సభ బరిలో దిగడానికి రంగం సిద్ధం చేసుకుంటోన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు చోట్ల పోటీ చేసి, పరాజయం పాలైన విషయం తెలిసిందే. తన సొంత నియోజకవర్గం హుజూరాబాద్‌తో పాటు గజ్వేల్‌లో కేసీఆర్‌తో తలపడ్డ ఈటల.. రెండు చోట్లా ఓడిపోయారు. ఈ సారి ఆయన లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టారు. మల్కాజ్‌గిరి లేదా మెదక్ స్థానాలను పరిశీలిస్తోన్నారు. మెదక్ వైపే మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి. మల్కాజ్‌గిరి నుంచి పీ మురళీధర్ రావు లేదా ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ అధినేత మల్కా కొమరయ్య పేర్లు కూడా బీజేపీ పరిశీలనలో ఉన్నాయి. మల్కాజ్‌గిరి లోక్‌సభ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి కొమరయ్య ఇప్పటికే ప్రచారం సైతం మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అదే ఖాయమైతే– ఈటల రాజేందర్.. మెదక్ నుంచి పోటీ చేస్తారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై తనిఖీలు షురూ: సిట్టింగ్ జడ్జీతో విచారణకు హైకోర్టు సీజేకి లేఖ మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం.. కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం ఇది. మొన్నటి వరకు ఆయన ఇదే స్థానానికి ప్రాతినిధ్యాన్ని వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినందు వల్ల తన లోక్‌సభ సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# 'మూణ్ణెల్ల గండం? ఆర్నెల్ల గండం?'

## ఈ గండాలను గట్టెక్కిస్తే...

# రేవంతుడికి తిరుగేలేదా?



హైదరాబాద్ : రాజకీయ వర్గాల్లోనూ.. మీడియా సర్కిల్స్ లోనూ.. అధికార వర్గాల్లోనూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాటల్లో తరచూ వినిపిస్తున్న అంశం.. రేవంత్ సర్కారు గండాన్ని ఎదుర్కొంటున్నారని. సాధారణ మెజార్టీకి కేవలం నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్న నేపథ్యంలో ఆయన పరిమితులతో పని చేయాల్సి వస్తోందన్న వాదన వినిపిస్తోంది. సొంతంగా నిర్ణయాలు తీసుకోవట్లేదని.. భట్టి.. ఉత్తమ్.. కోమటిరెడ్డి.. పొంగులేటిలను కలుపుకుపోతూ బండి నడిపిస్తున్నట్లు చెబుతున్నారు. అప్పుల కుప్పలా మారిన ఆర్థిక పరిస్థితుల్ని చక్కదిద్దే విషయంలో రేవంత్ తన మార్కును ప్రదర్శించలేకపోతున్నట్లుగా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజమెంత? నిజంగానే.. సీఎం రేవంత్ పదవీ గండాన్ని ఎదుర్కొంటున్నారా? ఆయన ప్రభుత్వానికి ఎక్స్‌పైరీ డేట్ మూణ్నెళ్లా? ఆర్నెల్లా? అన్నదిప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇంతకూ ఈ వాదన ఎందుకు తరచూ వినిపిస్తోంది? అంటే.. ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే ఫాంహౌస్ లో తన ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు.. ఇతర ప్రజాప్రతినిధులు..నేతలతో భేటీ అయిన గులాబీ బాస్ కేసీఆర్.. రేవంత్ ప్రభుత్వం మూణ్నెళ్లు కూడా ఉండదన్న మాటల అంచనాతోనే. మూణ్ణెళ్లు మౌనంగా ఉండాలని.. ఆర్నెల్లలో జరగాల్సింది జరుగుతుందన్న వ్యాఖ్యలు రేవంత్ సర్కారుకు తొలి గండంగా మారాయని అంటున్నారు. దీనికి కారణం.. కేసీఆర్ ఏదీ తొందరపాటుతో అనరని.. ఆయన నోటి నుంచి వచ్చిన మాటలకు ఇచ్చిన అధిక ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకొని రేవంత్ సర్కారును తక్కువగా అంచనా వేయటం మొదలైందని చెప్పాలి. ఇక.. పొలిటికల్ సర్కిల్స్.. మీడియా వర్గాల్లోనూ కొత్త విశ్లేషణ మొదలైంది. తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఓపక్క.. వంద రోజుల హామీల అమలుతో రేవంత్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి అవుతుందని చెబుతున్నారు. ఈ మాటల్ని చెబుతున్న వారు.. గతంలో తియ్యటి మాటలు చెప్పి.. ఏళ్లకు ఏళ్లు హామీల అమలు చేయని రోజుల్లో ఏం చేశారు? అన్నది ప్రశ్న. వంద రోజుల్లో హామీలు అమలు మాట చెప్పినప్పటికీ.. గత ప్రభుత్వం తాలుకూ ఆర్థిక గాయాల్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోదా? అన్నది ప్రశ్న. మహాలక్ష్మి స్కీంలో భాగంగా జరిగిన సోషల్ మీడియా ప్రచారాన్ని చూసినప్పుడు.. ఉచితాలు అక్కర్లేదని.. ప్రభుత్వ పథకాల అవసరం కంటే కూడా డెవలప్ మెంట్ మీదా.. ఉపాధి మీద ఫోకస్ చేయాలని చెప్పిన మాటల్నే పరిగణలోకి తీసుకుంటే.. వంద రోజుల్లో హామీ అమలు కాస్త ఆలస్యమైనా అర్థం చేసుకోరా? అన్నది ప్రశ్న. దీనికి తోడు వంద రోజుల హామీ అమలుకు సార్వత్రిక ఎన్నికల కోడ్ కూడా అడ్డంకిగా మారుతుంది కాబట్టి.. వాటిపై అతిగా ఆలోచించటం లో అర్థం లేదంటున్నారు. ఇక.. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రభావం కూడా రేవంత్ సర్కారు మీద ఉంటుందని చెబుతున్నారు. ఇక్కడ కూడా ఒక విషయాన్ని ప్రస్తావించాలి. 2018లో ఆశ్చర్యకర రీతిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి.. నాటి టీఆర్ఎస్ కు తిరుగులేదని..కేసీఆర్ సర్కారు దూసుకెళుతుందన్న ప్రచారం జరిగిన నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలు జరగటం.. వాటి ఫలితాలు అంచనాలకు సంబంధం లేకుండా ఉండటం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పు.. లోక్ సభకు జరిగే ఎన్నికల వేళలో ప్రజల తీర్పు భిన్నంగా ఉంటుందన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై అందరికి అవగాహన ఉన్నప్పుడు.. రేవంత్ ప్రభుత్వానికి గండం పొంచి ఉందన్న మాటలన్ని కూడా ఉత్త ప్రచారమే తప్పించి మరింకేమీ లేదని చెప్పాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే.. ఏదో అయిపోతుందన్న ప్రచారంతో రేవంత్ సర్కారు స్పీడ్ కు బ్రేకులు వేసే వ్యూహమే తప్పించి మరింకేమీ లేదన్న మాట వినిపిస్తోంది. తరచి చూస్తే.. అలాంటి కుట్ర ఏదో జరుగుతుందన్న భావన కలుగక మానదు.

# సంపాదకీయం

## ఆ భారీ ప్రాజెక్టుకు 2019లోనే 500 కోట్లతో రిపేర్లు.. గప్ చుప్?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముంగిట అత్యంత వివాదాస్పదమైన ప్రాజెక్టు అది.. అంతకుముందటి ఎన్నికల మధ్య ఓ పార్టీ గెలుపునకు దోహదపడిన ప్రాజెక్టు అది.. తెలంగాణ సమాజంలో అత్యంత చర్చనీయాంశమైన ప్రాజెక్టు అది.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు నీరందించినట్లుగా లెక్కలు బయటకు వచ్చిన ప్రాజెక్టు అది.. అలాంటి భారీ నిర్మాణం సరిగ్గా ఎన్నికల ముంగిట కుంగింది. అప్పటి ప్రభుత్వాన్ని అప్రదిష్ఠ పాల్జేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ అక్టోబరు నెలలో కుంగిన సంగతి తెలిసిందే. అది తీవ్ర వివాదాస్పదం అయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత సమర్థించుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలు కూడా పరిశీలించి నిర్మాణాన్ని తప్పుబట్టాయి. ఇదే అన్నారం బ్యారేజీ లోనూ లోపాలు బయటపడ్డాయి. మొత్తానికి ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఎన్నికల్లో ఓటమికూడా చెందింది. కాగా.. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తీవ్ర వివాదాస్పదమైన అంశం మరొకటి బయటకు వస్తోంది. దీనిపై నిజానిజాలు ఎంతో తెలియాల్సి ఉంది. అయితే, ఈ కథనాల ప్రకారం కాళేశ్వరంలో భాగమైన మూడు బ్యారేజీలు మేగిగడ్డ, అన్నారం, సుందిళ్ల 2019లో వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయంట. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.500 కోట్లను పెట్టి మరమ్మతు చేయించిందట. ఈ విషయం అసలు బయటకు రాకుండా చూసిందట. కాంట్రాక్టరు మరమ్మతుకు అంగీకరించకపోడంతో గత సర్కారే చేతుల్లోంచి పెట్టుకుందట.

**సరిగ్గా ఎప్పుడు జరిగిందంటే..?** వరదలు సంభవించిన నేపథ్యంలో.. 2019 నవంబరులో కాళేశ్వరం బ్యారేజీల్లోని ఆర్సీసీ కోటింగ్, సీసీ కర్టెన్ వాల్స్, సీసీ బ్లాక్స్, బ్యారేజీల కిందిభాగంలో ఉండే అప్రాన్ కొట్టుకుపోయిందట. రూ.180 కోట్లతో (మేడిగడ్డలో రూ.83 కోట్లు, అన్నారంలో రూ.65 కోట్లు, సుందిళ్లలో రూ.32 కోట్లు) ప్రాథమికంగా మరమ్మతులు చేసినా.. మొత్తం నష్టాన్ని పూడ్చేందుకు రూ.500 కోట్లు వ్యయం అయిందని లెక్క. కాగా, ఈ విషయాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తప్పుబట్టినా.. బీఆర్ఎస్ సర్కారు తొక్కిపట్టిందట. మేడిగడ్డ కుంగిన సందర్భంలో ఖర్చంతా కాంట్రాక్టరుదేనని అప్పటి ప్రభుత్వ పెద్దలు వాదించారు. దీనిపైనా తర్వాత తీవ్ర విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. మరిప్పుడు ఏం జరగనుందో చూడాలి.

**10 టీమ్ లతో విజిలెన్స్ సోదాలు..** కాళేశ్వరంలో మరో మలుపు తరహాలో.. విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ జల సౌధలోని కాళేశ్వరం కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ కాకుండా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ లోని సాగునీటి డివిజన్ కార్యాలయాల్లో మేడిగడ్డ, కన్నెపల్లి పంప్ హౌస్ రికార్డులు, కరీంనగర్ లోయర్ మానేరు డ్యాంలోని ఇరిగేషన్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సోదాల్లో 10 ఇంజినీరింగ్, విజిలెన్స్ బృందాలు పాల్గొనడం గమనార్హం.

## జిల్లా వ్యాప్తంగా గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలి...

### అంగన్వాడీ కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి...

### అధికారులతో సమీక్ష సమావేశంలో మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్....





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం సరిగ్గా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉందని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, సంబంధిత శాఖ అధికారులతో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారాన్ని తప్పకుండా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు తదితర అంశాలపై కలెక్టర్ గౌతమ్ అధికారులను పూర్తి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. దీంతో పాటు జిల్లాలో డే కేర్ సెంటర్ల నిర్వహణ, సెక్టార్ల వారీగా వివరాలు, ఎక్కడైనా కొత్త అంగన్వాడీ కేంద్రాలు అవసరమున్నాయనే వివరాలను జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డితో పాటు సంబంధిత సీడీపీవోలు, సూపర్వైజర్లను కలెక్టర్ వివరాలను తెలుసుకున్నారు. ఈ విషయంలో అంగన్వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని... ప్రతి ఒక్కరికీ అన్ని రకాల సదుపాయాలు అందించేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, అంగన్వాడీ టీచర్లపై ఉందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు ఎలా నడుస్తున్నాయి... ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను కలెక్టర్ ఆయా సూపర్వైజర్లను ప్రత్యేకంగా అడిగారు. అంగన్వాడీ కేంద్రాల్లో నూనె, పప్పులు, పాలు, కోడిగుడ్లు తదితరాలు ఎంత స్టాక్ ఉంది...బరువు తక్కువ ఉన్న వారి వివరాలతో పాటు బాలామృతం అందచేస్తున్నారా ? అనే వివరాలను అధికారుల ద్వారా కలెక్టర్ గౌతమ్ తెలుసుకున్నారు. ఈ విషయంలో అధికారులు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సూచించారు. జిల్లాలో మోడల్ అంగన్వాడీ కేంద్రాలు ఇతర కేంద్రాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని... అందుకు అవసరైమన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. అలాగే ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని సూపర్వైజర్లు, సీడీపీవోలు ఎప్పటికప్పుడు అంగన్వాడీ కేంద్రాలకు క్షేత్రస్థాయిలో వెళ్ళి పరిశీలనలు, తనిఖీలు చేపట్టాలని అంగన్వాడీ టీచర్లు విధిగా తమ సమయపాలన పాటించాలని అదే విధంగా రిజిస్ట్రర్లు, ఆన్లైన్లో వివరాలను ఏ రోజుకారోజు నమోదు చేయాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ సమీక్ష సమావేశంలో ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యువో) కృష్ణారెడ్డి, జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్వైజర్లు, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటి చెప్పాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్







ఆదిలాబాద్ జనవరి 11 : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న 217 జయంతి కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు పాయల్ శంకర్ తో కలిసి ఆయన పాల్గొని, ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వద్దే ఓబన్న పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వం స్వతంత్ర్య సమరయోధులు, మహనీయుల జయం తి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తున్నది అన్నారు. ఓబన్న జయంతి సందర్భంగా ప్రజలందరి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతం త్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న పోరాటం వీరోచితమని, మహనీయుని చరిత్ర నేటి యువత కు ఆదర్శ ప్రాయమని అన్నారు. ఒడ్డెర కులస్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాసన సభ్యులు మాట్లాడుతూ, సమాజ హితం కోసం పోరాడిన ఓబన్న పోరాటం మరువలేనిదని అన్నారు. ఒడ్డెర కులస్తుల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కేద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వ కర్మ పథకంలో రుణాల మంజూరుకు కులవృత్తులు చేసేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టణంలో సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, బిసి సంక్షేమ అధికారి రాజలింగు, మైనారిటీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేష్, వివిధ కుల సంఘాల నాయకులూ, అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత దేశ అభ్యున్నతికి ఊతమి

శామీర్ పేట ( గరుడ వార్త) : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. గురువారం జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సాధికారత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా జెండర్ స్పెషలిస్ట్ వాసవి మాట్లాడుతూ మహిళలు ఎంచుకున్న రంగాలలో సొంతగా నిర్ణయాలు తీసుకొనే స్థాయికి ఎదగాలన్నారు. నేటి సమాజంలో మహిళలపై జరిగే హింసల పట్ల మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి చెప్పారు. ఇళ్లలో జరిగే హింసలు,



బయట ఎదుర్కొనే హింసలు, హత్యాచారాలు, పని ప్రదేశాలలో జరిగే లైంగిక , శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు లోనైనప్పుడు ఆందోళన చెందకుండా ధైర్యంగా తమ సమస్యలను చెప్పుకొని పరిష్కార దిశగా ముందుకు సాగాలన్నారు. మహిళలు సమస్యలు చెప్పుకోవడానికి, పరిష్కరించుకోవడానికి మహిళ హెల్ప్ లైన్ 181 ఉందని ఆమె అవగాహన పరచారు. సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన, ముద్ర లోన్స్, స్టాండప్ ఇండియా స్కీం, గృహహింస చట్టం, ఫోక్స్ చట్టాలపై సహాయం పొందేందుకై హెల్ప్ లైన్ నంబర్లు 1098, 14567 లలో సంప్రదించాలని ఆమె మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిచోట పంపిణీ చేస్తున్న అయోధ్య రామయ్య అక్షింతల

శామీర్ పేట ( గరుడ వార్త ) : తుమ్మకుంట మున్సిపాలిటీ షామీర్పేట్ మూడు చింతలపల్లి మండలాల పరిధిలోని పట్టణ పల్లెలు అన్న తేడా లేకుండా ప్రతిచోట అయోధ్య రామయ్య అక్షింతలను అందజేస్తున్నారు. అందులో భాగంగా ఇంటింటికీ గురువారం పంపిణీ చేశారు. మండల కేంద్రం శామీర్ పేట లో అయోధ్య రామయ్య అక్షింతలను గ్రామస్తులు, యువకులు ఇంటింటికి తిరుగుతూ హుషారుగా పంపిణీ చేశారు. అక్షంతలు స్వీకరించడానికి గ్రామస్తులు మంగళహారతులు పట్టి ఎంతో భక్తి శ్రద్ధలతో అక్షంతలను స్వీకరించారు.



అలాగే శామీర్ పేట మండలం లోని వివిధ గ్రామంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అయోధ్య రామయ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. రామయ్య అక్షంతలను తీసుకొని వెళ్ళగానే మంగళహారతులతో స్వాగతించి ఎంతో భక్తి తో అక్షంతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించిన ఉషోదయ లేజర్ ఐ ఆస్పత్రి

శామీర్ పేట (గరుడ వార్త) : విద్యార్థి దశలోనే కంటి సమస్యలు గుర్తించగలిగితే అట్టి సమస్యలు జటిలం కాకుండా ఎంతగానో తోడ్పడతాయనే సదుద్దేశంతోఉషోదయ లేజర్ ఐ ఆస్పత్రి అద్వర్యలో విద్యార్థులకుఉషోదయ లేజర్ ఐ ఆస్పత్రి అద్వర్యలో గురువారం తుర్కపల్లి సెయింట్ మేరీ సెంట్రల్ స్కూల్ (సిబిఎస్ఈ) విద్యార్థులకు




కంటి చూపు పరీక్షలు నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కంటి దృష్టి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, అధ్యాపక బృందం, పాఠశాల కరస్పాండెంట్ ఏల్లు వరప్రసాద్ రెడ్డి, ఏల్లు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనల పై విద్యార్థుల అవగాహన ర్యాలీ

శామీర్ పేట (గరుడ వార్త) : రోడ్డు భద్రత నియమ నిబంధనలపై విద్యార్థుల అవగాహన పొందుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత నిబంధనలపై గురువారం తుర్కపల్లి గ్రామంలో విద్యార్థులు ర్యాలీని తుర్కపల్లిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్ (సిబిఎస్ఈ) విద్యార్థులు తదితరులు నిర్వహించారు.



ఈ సందర్భంగా నేషనల్ రోడ్ భద్రత వారోత్సవంలో భాగంగా విద్యార్థులు జీనోమ్ వ్యాలీ తుర్కపల్లి పోలీసుల సహకారంతో ( హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ 10 గోల్డెన్ రూల్స్ ఫర్ రోడ్ సేఫ్టీ) అనే టాపిక్ తో ఫ్లెక్సీలు, ప్లే కార్డ్స్, స్లోకన్లతో ,ర్యాలీని నిర్వహించి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఏల్లు వరప్రసాద్ రెడ్డి, ఏల్లు తిరుపతిరెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి పెంపునకు చర్యలు

గోదావరిఖని: సింగరేణి సంస్థకు 20 మిలియన్ టన్నుల బొగ్గు అందుబాటులోకి రానుంది. నాలుగు కొత్త ప్రాజెక్టులను ప్రారంభించుకోవడానికి సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కొన్ని పనులు చేపట్టిన సింగరేణి తుది అనుమతుల కోసం వేగంగా ప్రయత్నాలు మొదలు పెట్టింది. నాలుగు కొత్త గనుల ద్వారా ఏటా 20 మిలియన్ టన్నుల ఉత్పత్తిని పెంచుకోనుంది. ప్రస్తుతం 18 ఉపరితల గనులు, 23 భూగర్భ బొగ్గుగనుల ద్వారా ఏటా 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తుండగా మరో 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టేందుకు నాలుగు కొత్త గనులను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకురానుంది. ఇవి కాకుండా మరో రెండు ప్రాజెక్టులను సైతం వచ్చే ఏడాది ప్రారంభించుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని పూర్తిస్థాయిలో తీసుకోవడానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇటీవల సింగరేణి ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఆయా అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా కొత్త సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరాం సంస్థ అధికారులతో నిర్వహించిన సమీక్షలో నాలుగు కొత్త ప్రాజెక్టుల పురోగతి, వాటి అనుమతులకు సంబంధించిన ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచేందుకు అధికారులు సమాయత్తం కావాలని ఆయన సూచించారు.

కొత్త గనులతో...సింగరేణి ప్రణాళికలో ఉన్న నాలుగు కొత్త గనులు అందుబాటులోకి వస్తే అదనంగా 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉంది. అంటే ఏటా 90 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టవచ్చు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకు పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో తుది అనుమతులకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు అధికారుల బృందం ఈనెల మూడో వారంలో భువనేశ్వర్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ గనికి సంబంధించిన భూసేకరణ, పర్యావరణ అనుమతులతో పాటు ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయింది. బొగ్గు రవాణాకు రైల్వే సైడింగ్ పనులకు సైతం టెండర్లు అప్పగించారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టే సామర్థ్యం ఉన్న నైనీ బొగ్గు బ్లాకు నుంచి ఈ ఏడాది ఆరు మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయాలని సంస్థ లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంతో పాటు కొత్తగూడెం వీకే ఓసీపీ నుంచి ఈ ఏడాది మూడు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని ప్రణాళికలు చేసుకుంది. ఏటా 4.3 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేసే వీకే ఓసీపీలో ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లో బొగ్గు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. బెల్లంపల్లి ప్రాంతంలోని గోలేటి ఓసీపీ ద్వారా ఏటా 3.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టనున్నారు. ఇల్లెందు ప్రాంతంలోని రొంపేడు ఓసీపీ ద్వారా ఏటా రెండు మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయనున్నారు. దీనికి సంబంధించి ఈ ఏడాది ఒక మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని సంస్థ భావిస్తోంది.

వచ్చే ఏడాది రెండు మెగా ఓసీపీలు

ప్రస్తుతం సింగరేణి సంస్థ భవిష్యత్తును మరింత పదిలం చేసుకోవడానికి గతంలో భూగర్భ గనులుగా ఉన్న వాటిని మెగా ఓసీపీలుగా మార్చేందుకు ప్రణాళికలు చేసుకుంది. వీటిని వచ్చే ఏడాది నాటికి అందుబాటులోకి తీసుకురానుంది. అందులో రామగుండం మెగా ఓసీపీ కింద మూసివేసిన జీడీకే-10, 10-ఎ గనులతో పాటు ఓసీపీ-1లోని కొంత భాగంతో మెగా ఓసీపీగా మార్చనున్నారు. భవిష్యత్తులో ఇదే గని కింద వకీలుపల్లె గనిని కూడా విలీనం చేయనున్నారు. దీంతో పాటు బెల్లంపల్లి ప్రాంతంలోని మహావీర్‌ఖని ఓసీపీ పనులు చేపట్టేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే మరో 10 మిలియన్ టన్నుల బొగ్గు అందుబాటులోకి వస్తుంది. అన్నీ సవ్యంగా పూర్తయితే ఈ మొత్తం గనుల ద్వారా సింగరేణి సంస్థ రానున్న రెండేళ్లలో ఏటా 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టనుంది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు

ఆలేరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం మంజూరు చేసింది. కళాశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన నిధులను కేటాయించింది. ప్రతి విద్యార్థికి రూ.38 చొప్పున నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తగిన బిల్లు పత్రాలు సమర్పించి నిధులను తీసుకోవచ్చని సూచించింది. ఉమ్మడి జిల్లాలో 31 జూనియర్ కళాశాలలు ఉండగా మొత్తం రూ.3.85 లక్షలు మంజూరయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. నల్గొండ జిల్లాలో 13, యాదాద్రి భువనగిరిలో 11, సూర్యాపేటలో 7 చొప్పున ఉన్నాయి. వీటిల్లో మొత్తం 10,157 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.38 ప్రాతిపదికన మొత్తం రూ.3,85,928 మంజూరయ్యాయి. వీటిని కళాశాల నిర్వహణలో భాగంగా స్టేషనరీ, సుద్దముక్కలు, శుభ్రత సామగ్రి కొనుగోలు చేయడం, తరగతి గదుల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడం తదితర ఖర్చులకు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఏమాత్రం సరిపోని నిధులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతంలో విద్యార్థుల ప్రవేశాల సమయంలో కొంత రుసుము తీసుకునే వారు. అందులోంచి కొంత



మొత్తాన్ని స్టేషనరీ, సుద్దముక్కలు తదితరాల కొనుగోలుకు ఉపయోగించుకునే వారు. ఉచిత విద్య అమలుతో విద్యార్థుల నుంచి నయాపైసా వసూలు చేయలేని పరిస్థితి నెలకొంది. కేవలం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల మీదనే ఆధారపడాల్సి వస్తోంది. ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.76 వంతున మాత్రమే ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇదీనూ ఏడాదిలో ఆరు నెలలకు ఒకసారి చొప్పున రెండు సార్లు ఒక్కో విద్యార్థికి రూ.38 చొప్పున మంజూరు చేస్తోంది. స్లిప్ టెస్ట్‌లు, అర్ధవార్షిక పరీక్షల సమయంలో జవాబు పత్రాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జాతీయ పండుగలను నిర్వహించాల్సి ఉంటుంది. తరగతి గదుల్లో విద్యుత్తు బల్బులు, ఫ్యాన్లు మరమ్మతులు, చీపుర్ల కొనుగోలు, తరగతి గదులు శుభ్రం చేయించడం అవసరాలకు ఈ నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని కళాశాలల అధ్యాపకులు అంటున్నారు. కనీసం ఒక విద్యార్థికి ఏటా రూ.200 మంజూరు చేయాలని కోరుతున్నారు.

# రహదారులకు లింకు కుదిరేనా?



హైదరాబాద్: దూర ప్రాంతాలను దగ్గర చేసేందుకు చేపట్టిన లింకు రోడ్ల నిర్మాణం అయోమయంలో పడింది. పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. హెచ్‌ఆర్‌డీసీఎల్ మనుగడపైనా ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. నిధుల్లేకపోవడంతో సంస్థ కార్యకలాపాలు స్తంభించినట్లు ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో పురోగతిలోని పలు ప్రధాన రహదారుల నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయని గుర్తు చేస్తున్నారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా విభాగం ఏర్పాటు కావొచ్చనే చర్చ మొదలైంది.మొదటి దశ పూర్తి 2017 మార్చి 11న హైదరాబాద్ రహదారుల అభివృద్ధి సంస్థ(హెచ్‌ఆర్‌డీసీఎల్) ఏర్పాటైంది. చకచకా లింకు రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు జరిగాయి. మొదటిదశ కింద 25 రోడ్డు మార్గాలను నిర్మించింది. వాటి విలువ రూ.323.67కోట్లు. రోడ్ల పొడవు 27.2కి.మీ. పనులు పూర్తయ్యాక రూ.185.25 కోట్లతో 17.5కి.మీ పొడవు రోడ్లను నిర్మించే రెండోదశ మొదలైంది. ప్రస్తుతం ఆ పనులన్నీ నిలిచిపోయాయి.

ఇవిగో ఉదాహరణలు

మూసారాంబాగ్ అలీకేఫ్ నుంచి నాగోల్ మెట్రోస్టేషన్ వరకు రెండేళ్ల కిందట లింకు రోడ్డు నిర్మాణం మొదలైంది. గదుల్లాంటి పట్టీలుండే రబ్బరు జాలీలను పరిచి వాటిపై మొరం నింపి చదును చేశారు. 300 మీటర్ల మేర మాత్రమే పూర్తయింది. ఉస్మాన్‌సాగర్ నుంచి వట్టినాగులపల్లి వరకు, ల్యాంకోహిల్స్ కూడలి నుంచి నార్సింగి, పుప్పాలగూడ వరకు పనులదీ అదే పరిస్థితి. జూబ్లిహిల్స్ రోడ్డు 5 నుంచి బంజారాహిల్స్ రోడ్డు 2ను కలిపే రోడ్డు ఆందోళనకరంగా ఉంది. సన్‌సిటీ పీఅండ్‌టీ కాలనీ నుంచి రాజేంద్రనగర్ వరకు 2.58 కి.మీ పొడవునా చేపట్టిన పనులు తుది దశలో నిలవగా, డాలర్‌హిల్స్ టు నెక్నాంపూర్, అల్కాపురి టౌన్‌షిప్ నుంచి నార్సింగి ఐదో రేడియల్ రోడ్డుకు, నెక్నాంపూర్ నుంచి అలిజపూర్ వరకు చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. సున్నం చెరువు నుంచి బోరబండ హద్దు వరకు చేపట్టిన పనులు నిలిచిపోయాయి. జవహర్‌నగర్ ఫైరింగ్ కట్ట నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు చేపట్టిన రోడ్డుకు భూసేకరణ సమస్యగా మారింది.

## అదే జోరు.. మారని తీరు..

చెన్నూరు : సర్కారు మారినా చెన్నూరు పురపాలికలో ప్రభుత్వ భూముల ఆక్రమణ మాత్రం ఆగడంలేదు. విలువైన సర్కారు స్థలాలన్నీ అన్యాక్రాంతమవుతున్నా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఆక్రమించుకున్న స్థలాల్లో అక్రమార్కులు రాత్రికిరాత్రే చిన్నపాటి షెడ్లు, బోర్ల నిర్మాణాలు చేపడుతూ పనికానిచ్చేస్తున్నారు. వారం క్రితం గెర్రె కాలనీ సమీపంలో జర్నలిస్టుల కు ప్రతిపాదించిన ప్రభుత్వ భూమిలో ఆక్రమణదారులు బోరు నిర్మాణం చేపట్టడం విస్మయానికి గురిచేస్తోంది.

వ్యవసాయం కోసం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోలు చేయరాదు. వాటిల్లో నిర్మాణాలు చేపడితే నేరంగా పరిగణిస్తారు. కానీ చట్టపరమైన నిబంధనలేవీ చెన్నూరు పురపాలక సంఘం పరిధిలో అమలు కావడం లేదు. వందల సంఖ్యలో భూ ఆక్రమణలు జరుగుతున్నా.. అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రారంభంలోనే అడ్డుకోకుండా నిర్మాణాలు పూర్తయిన తరువాత స్పందిస్తున్నారు. అందినకాడికి దండుకుంటూ కబ్జా స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూమంత్రపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు.

విలువైన భూములు కావడంతో

పట్టణ సమీపంలోని గెర్రెకాలనీని ఆనుకొని జాతీయ రహదారి 63 వెళ్తోంది. దానికి ఇరుపక్కలా రూ.లక్షల్లో విలువచేసే ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉన్నాయి. చెన్నూరు పురపాలికగా రూపాంతరం చెందిన తరువాత సదరు భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. నిబంధనలకు విరుద్ధంగా హక్కుదారుల నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసిన రియల్టర్లు వాటిని ప్లాట్లుగా చేసి విక్రయాలు చేపట్టారు. ఖాళీగా ఉన్న మరికొన్ని స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి.

పాత్రికేయులకు ప్రతిపాదించినదైనా వదలట్లేదు..

గెర్రెకాలనీ సమీపంలోని కత్తెరశాలకు వెళ్లే రహదారి మార్గంలో(ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న వంద పడకల ఆసుపత్రి ఎదురుగా) సర్వేనెంబరు 863లో 8.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో రెండెకరాలకు పైగా గతంలో పాత్రికేయులకు ఇస్తామని అధికారులు ప్రతిపాదించారు. దీనిపై కన్నేసిన కబ్జాదారులు ఓ పార్టీకి చెందిన నేతల అండదండలతో ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సదరు భూమిని కొనుగోలు చేసినట్లు సమాచారం. వాటిని గుంటల చొప్పున స్థానికులకు పలువురికి విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అదే సర్వేనెంబరులో శాశ్వత



నిర్మాణాలు చేపట్టే క్రమంలో బోర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తమకు కేటాయించిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందని, దాన్ని కబ్జాదారుల చెరనుంచి కాపాడాలని కోరుతూ స్థానిక ప్రెస్‌క్లబ్ సభ్యులు సోమవారం పోలీస్‌స్టేషన్, తహసీల్దారు, పురపాలకసంఘ కార్యాలయాల్లో ఫిర్యాదులు సమర్పించారు.

చెన్నూరు పట్టణంలోని (63వ జాతీయ రహదారి పక్కన) వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగి వెనకాల ఉన్న అసైన్డ్ భూమి ఇది. హక్కుదారుల నుంచి కొనుగోలు చేసిన పలువురు వ్యక్తులు ఇలా చిన్నపాటి షెడ్ల నిర్మాణాలు చేపట్టి వాటికి ఇంటి నెంబర్లు, విద్యుత్తు మీటర్లు సైతం పొంది భూములను కాపాడుకుంటున్నారు

చెన్నూరు పట్టణంలోని జాతీయ రహదారి 63 పక్కన ఉన్న అసైన్డ్ భూమి ఇది. దీన్ని ఓ వ్యక్తి కొనుగోలు చేసి అందులో ఇటీవల నిర్మాణాన్ని ప్రారంభించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ నిర్మాణం సాగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలే లేవు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: మల్లికార్జున్, తహసీల్దారు, చెన్నూరుప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జా చేయడం, వాటిల్లో నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వ స్థలాలను కబ్జాచేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టం. ఇటీవల ప్రభుత్వ స్థలంలో బోరు నిర్మాణం చేపట్టారన్నది తమ దృష్టికి వచ్చింది. ఈ విషయమై విచారణ జరుపుతున్నాం. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# బలమైన వారికే టిక్కెట్లు




హైదరాబాద్: రాజధానిలో మళ్లీ రాజకీయ వేడి మొదలైంది. వీలైనన్ని లోక్‌సభ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రధాన పార్టీలు అప్పుడే దృష్టి సారించాయి. బలమైన అభ్యర్థులను బరిలో దింపడం ద్వారా అన్ని స్థానాలను కైవశం చేసుకుని తమ సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ యోచిస్తోంది. ఇందులో భాగంగా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. భారాస ఒక్క స్థానంలో సిట్టింగ్ ఎంపీనే బరిలో దింపాలని నిర్ణయించింది. మిగిలిన స్థానాల్లో 'బలమైన' అభ్యర్థులను బరిలో దింపడానికి నేతలతో చర్చలు మొదలుపెట్టింది. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షలు మొదలుపెట్టింది. గతంలో కాకుండా ఈసారి ఈ రెండు ప్రధాన పార్టీలకు దీటుగా బలమైన అభ్యర్థులను దింపడం ద్వారా ఆ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలని భాజపా ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జిలను ప్రకటించింది. రాజధాని పరిధిలో హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ స్థానాలొస్తాయి. మార్చిలో ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో 64 స్థానాలను సాధించిన కాంగ్రెస్.. రాజధానిలో మాత్రం అనుకున్న విధంగా సాధించలేకపోయింది. మొత్తం 29 స్థానాల్లో 3 మాత్రమే దక్కించుకుంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపడానికి ఇప్పటి నుంచే అన్వేషణ మొదలుపెట్టింది.

హైదరాబాద్

ఇక్కడి నుంచి పోటీకి ఏ నేతలూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి ఫిరోజ్‌ఖాన్‌కుగానీ, మరొకరికిగానీ టిక్కెట్ దక్కే అవకాశం ఉందంటున్నారు. ఎంఐఎం తరఫున మరోసారి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేస్తున్నారు.

చేవెళ్ల ఇక్కడి నుంచి అనేక మంది నేతలు కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తున్నా రెండు ప్రధాన పార్టీల్లో బలమైన నేతల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భాజపా విషయానికి వస్తే మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డికి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. భారాస ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని మరోసారి పోటీకి నిలుపుతున్నామని ప్రకటించింది.

సికింద్రాబాద్ అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్ తదితర నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో భారాస నుంచి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయికిరణ్ యాదవ్ పోటీ చేశారు. ఈసారి అతనికే ఇస్తారా లేనిపక్షంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌నే బరిలో నిలుపుతారా అన్నది కొద్ది రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక భాజపా నుంచి మరోసారి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోటీకి నిలిపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక్కడి నుంచి అభ్యర్థిని బరిలో దింపాలా లేదా అన్నదానిపై ఎంఐఎం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

మల్కాజిగిరి

గత ఎన్నికల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గెలుపొందగా ఈస్థానాన్ని మళ్లీ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఆయన ఉన్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి పోటీకి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మల్‌రెడ్డి రాంరెడ్డి, మధుయాష్కీ ఆసక్తి చూపిస్తున్నారు. ఇక భారాస తరఫున ఈ స్థానం నుంచి మాజీ మంత్రి కేటీఆర్ బరిలో దిగాలని ఆ పార్టీ నేతలు గట్టిగా కోరుతున్నారు. అయితే ఈ టిక్కెట్‌ను తనకు ఇవ్వాలని మాజీ మంత్రి మల్లారెడ్డి కోరుతున్నారు. ఇది కొద్దిరోజుల్లోనే తేలనుంది. నేతల ఒత్తిడి తలొగ్గి కేటీఆర్‌ను అభ్యర్థిగా భారాస అధిష్ఠానం నిర్ణయిస్తే కాంగ్రెస్ కూడా ఆర్థికంగా బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని యోచిస్తోంది.

# మూతబడి ఉండదిక!

మిర్యాలగూడ : ప్రతి గ్రామపంచాయతీలో ఒక సర్కారు బడి ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ విద్యా వ్యవస్థకు పూర్వ వైభవం రానుంది. దశాబ్దాల క్రితం గ్రామపంచాయతీ పరిధిలో అక్కడి జనాభాకు అనుగుణంగా అప్పటి ప్రభుత్వాలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేశాయి. ప్రైవేట్ పాఠశాలలపై తల్లిదండ్రుల మోజు, ప్రభుత్వ పాఠశాలలపై అపనమ్మకంతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పట్టారు. విద్యార్థులు లేరన్న నెపంతో ప్రభుత్వం ఆయా పాఠశాలలను మూసి వేసింది. పాఠశాలలు మూతపడటంతో విలువైన పాఠశాల భవనంతో పాటు కల్పించిన మౌలిక సదుపాయాలు నిరుపయోగంగా మిగిలాయి. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటు అందించిన పక్షంలో గ్రామీణ పాఠశాలలు బలోపేతమయ్యే అవకాశం ఉంది.

సీఎం ఆదేశాలతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉమ్మడి జిల్లాలో 59 మండలాలతో పాటుగా నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల్లోని గ్రామ పంచాయతీలు, నూతన గ్రామపంచాయతీలు, తండాలు గ్రామపంచాయతీలుగా ఏర్పాటైన ప్రాంతాల్లో తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాల ఉండాలని గుర్తిస్తున్నారు.

విద్యాహక్కుచట్టం ప్రకారం ప్రతి కిలోమీటరు దూరంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని చెబుతుండగా.. ఈ మేరకు ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో పాఠశాల ఏర్పాటు చేస్తే నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించినట్లు అవుతుంది.

ప్రభుత్వం కొత్తగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనుండగా నూతనంగా ఏర్పాటు చేయాల్సిన పాఠశాలలు, మూతబడిన పాఠశాలల వివరాలకు వాటి ఖాళీల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసి ఆంగ్ల మాధ్యమం ప్రారంభిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు



పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతమయ్యే అవకాశముంది.

నమ్మకం కలిగించాలి

భాస్కర్, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గ్రామాల్లో పునరుద్ధరించే ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం నమ్మకం కలిగించాలి. సమర్థవంతమైన నిర్వహణ, పర్యవేక్షణ ద్వార ప్రజల్లో నమ్మకం కలిగించవచ్చు. విద్యార్థులతో సంబంధం లేకుండా పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాల్సి ఉంటుంది. ఈ విషయమై గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ నిర్ణయానికి తోడ్పాటు అందించాల్సి ఉంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో మూతబడిన పాఠశాలలు, నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల వివరాలు సేకరిస్తున్నాము. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపేందుకు సిద్ధం చేస్తున్నాము. ఉన్నతాధికారుల అనుమతితో పాఠశాలలు తిరిగి ప్రారంభిస్తాము.

బి.భిక్షపతి, డీఈవో, నల్గొండ

## అక్రమాలు అనేకం.. రికవరీ గగనం

ఆసిఫాబాద్ : వలసల నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు ఉద్దేశించిన ఉపాధిహామీ పథకంలో ఏటా రూ.కోట్ల పనులు జరుగుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న తరహాలో కనిపిస్తోంది. ఏటా నిర్వహించే సామాజిక తనిఖీల్లో రూ.కోట్లలో సొమ్ము పక్కదారి పడుతున్నట్లు తేలినా బాధ్యులపై కఠినచర్యలు లేకపోవడం.. నిధులను రికవరీ చేయడంలోనూ సంబంధిత అధికారుల ఉదాసీన వైఖరితో పథకం ముఖ్యఉద్దేశం నెరవేరడం లేదు. కొన్ని మండలాల్లో సామాజిక తనిఖీలకే అధికంగా ఖర్చు అవుతుండగా వీరు గుర్తించిన అవకతవకల సొమ్ము అతి స్వల్పంగా ఉంటోంది. ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న తనిఖీల్లో అటవీశాఖ అధికారులు తమ పనుల నివేదికలను ఇవ్వకపోవడంతో వీటిపై పూర్తిగా పర్యవేక్షణ కొరవడుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నాలుగు జిల్లాల పరిధిలో అటవీప్రాంతం ఉంది. నర్సరీలు, మొక్కల పెంపకం, కందకాల తవ్వడం తదితర పనులన్నీ అటవీ ప్రాంతాల్లో చేపడుతున్నారు. వీటికి సంబంధించిన నివేదికలను సామాజిక తనిఖీల్లో అటవీ అధికారులు అందించాలి. ప్రతి మండలంలో రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలు ఆపైన అటవీ ప్రాంతంలో పనులు చేపడుతున్నా.. అందుకు సంబంధించిన వివరాలపై విచారణ జరగడం లేదు. ఈ నేపథ్యంలో మొక్కల పెంపకం, ప్లాంటేషన్ పనులన్నీ నామమాత్రంగా సాగుతున్నాయి. పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఏటా వందలాది సీసీరోడ్లు హడావుడిగా, మొక్కుబడిగా ఉపాధిహామీ నిధులతో చేపడుతున్నారు. ఈ వివరాలు సైతం సామాజిక తనిఖీ అధికారుల వద్దకు రావడం లేదు.రూ.2 లక్షల వరకు ఖర్చు..ఏడాదికి ఒకసారి చేసే సామాజిక తనిఖీలకు రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోంది. వీరు గుర్తించిన అక్రమాలు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా రూ.లక్షలోపే అనేక మండలాల్లో ఉంటున్నాయి. అక్రమాలు గుర్తించి సత్వరమే రికవరీ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.కెరమెరి మండలంలో జోడేఘాట్‌కు వెళ్లే మార్గంలో, ఘాట్ సమీపంలో 1000 హెక్టార్లలో 3 వేల మొక్కలను గత సంవత్సరం నాటారు. ఇప్పుడు ఇక్కడ ఒక్క మొక్క లేదు. ఈ సంవత్సరం నిర్వహించిన సామాజిక తనిఖీల్లో కెరమెరి, సిర్పూర్(యు) మండలాలకు సంబంధించి రూ.35 లక్షలను విచారణ జరగలేదు.

# నీటి సరఫరా అస్తవ్యస్తం

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో పక్షం రోజులుగా నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఏ సమయంలో కుళాయి నీరు వస్తుందో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని డివిజన్ల ప్రజలకు సరఫరా జరగడంలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. రానున్న వేసవిలో ఇలాంటి సమస్యలు రాకుండా ముందస్తుగానే సామగ్రి అందుబాటులో ఉంచుకోవాల్సిన అవసరముంది. వాల్వు మరమ్మతు చేస్తున్నారని, రెండు రోజుల్లో బిగించి సరఫరా చేస్తామని రిజర్వాయర్ ఏఈ అయూబ్‌ఖాన్ తెలిపారు.

ఆ డివిజన్లకు రోజు విడిచి రోజు..

కరీంనగర్ నగర పాలక సంస్థ అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో పలు డివిజన్లకు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత నెల 25న గేట్ వాల్వు దెబ్బతినడంతో మరమ్మతుకు హైదరాబాద్‌కు పంపించారు. రిజర్వాయర్ నుంచి డివిజన్లకు నీటిని పంపిణీ చేయడం సమస్యగా మారింది. ట్యాంకు నింపి ఇళ్లలోకి నల్లా కనెక్షన్లకు నీటిని విడుదల చేయాలంటే నాకా చౌరస్తాలోని వాల్వును కంట్రోల్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్యాంకు నిండాలంటే ముందుగా ఈ వైపు ఉన్న ప్రధాన పైపులైను నిండితే తప్ప సరఫరా చేసేందుకు వీల్లేకుండా మారింది. గత 15 రోజులుగా 2, 3, 4, 5, 24, 25,



26, 27, 28, 42, 44 డివిజన్లకు రోజు విడిచి రోజు శుద్ధి నీటిని ఇస్తున్నారు. వాల్వును వెంటనే మరమ్మతులు చేయాల్సిన గుత్తేదారు ఆలస్యం చేయగా, నీటి విభాగం అధికారులు ఒత్తిడి పెంచడంతో ఈనెల 6 నుంచి మరమ్మతులు మొదలైనట్లు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం వరకు మరమ్మతు కాకపోవడంపై కార్పొరేటర్లు ఆగ్రహించారు. తరచూ చెడిపోతుండగా, అదనంగా వాల్వులు, ఇతర వస్తువులు అందుబాటులో లేకపోవడం, ఈ రిజర్వాయర్ పరిధిలోనే అధిక లీకేజీలు ఉండటం, వాల్వులు మరమ్మతుకు వస్తుండటంతో తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది.

# భగీరథ నీరు.. అందని తీరు

మెట్‌పల్లి: ఇంటింటికీ శుద్ధ జలం అందించాలన్నది మిషన్ భగీరథ పథకం లక్ష్యం. పథకం ప్రారంభమై నెలల గడుస్తున్నా ఇంకా భగీరథ నీరు చేరని గ్రామాలున్నాయంటే అతిశయోక్తి కాదు. భగీరథ నీరు రాక నీటి సమస్య ఉత్పన్నమవుతుందని, పాత నీటి పథకాలు వినియోగించడంతో విద్యుత్తు బిల్లులు వేలల్లో వస్తున్నాయని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలాల్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన పంపుల్లో నాలుగింటికీ మూడే నడవడంతో డబ్బా మిషన్ భగీరథ ప్రధాన గ్రిడ్‌కు సరిపడా నీరు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బామిషన్ భగీరథ ప్రధాన గ్రిడ్ నుంచి జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లోని 347 నివాస ప్రాంతాలు, అయిదు పురపాలికలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎస్సారెస్పీ నీటిని డబ్బాకు తరలించందుకు జలాల్‌పూర్ వద్ద ఆరు పంపులను ఏర్పాటు చేశారు. ఇందులో నాలుగు పంపులను నిత్యం నడిపించి గంటకు 6 వేల క్యూబిక్ లీటర్ల నీటిని డబ్బా గ్రిడ్‌కు చేరవేయాలి. అక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తారు. పంపులు మరమ్మతులకు గురికావడంతో సరిపడా నీరు రాక సమస్య తలెత్తుతోంది.

మూడు పంపుల ద్వారా..

జలాల్‌పూర్ నుంచి నాలుగు పంపులు నిత్యం నడవడం ద్వారా గంటకు 6 వేల క్యూబిక్ లీటర్ల నీరు డబ్బా గ్రిడ్‌కు చేరితే ఎలాంటి సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు. కొన్ని నెలలుగా కేవలం అక్కడ మూడు పంపులే నడుస్తున్నాయి. మిగతా పంపులు మరమ్మతుకు గురైనట్లు సమాచారం. దీంతో డబ్బా గ్రిడ్‌కు 3,500 క్యూబిక్ లీటర్ల నీరు మాత్రమే చేరుతుండడంతో నీటి అవసరాలు సరిపోవడం లేదు. భగీరథ నీటిని పురపాలిక ప్రాంతంలో ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 100 లీటర్లు ఇవ్వాలి. ఈ లెక్కన 102 మిలియన్ లీటర్ల నీరు అవసరముంటుంది. ప్రస్తుతం వస్తున్న నీటితో కేవలం 80 నుంచి 90 మిలియన్ లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాలకు భగీరథ నీరు అందడం లేదు. జిల్లాలోని కొన్ని పట్టణాలు, గ్రామాలకు రోజు విడిచి రోజు భగీరథ నీటిని సరఫరా చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాలకు సరఫరా కావడం లేదు. ఇప్పటికీ నీరు రావడం లేదు..

మెట్‌పల్లి మండలంలో 23 గ్రామాలకు గాను 34 నివాస ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలని పైపులైన్లు వేశారు. 25 నివాస ప్రాంతాలకు భగీరథ నీరు సరఫరా కావడం లేదు. కొన్ని గ్రామాలకైతే ఇప్పటికీ భగీరథ నీరు చేరలేదు. గ్రిడ్‌కు అనుకున్నంత నీరు రాకపోవడం, మండలంలో కొన్ని గ్రామాలు ఎత్తులో ఉండడంతో ట్యాంకులకు నీరు చేరడం లేదని అధికారులు చెబుతున్నారు. మండల ప్రజాప్రతినిధులు పలుమార్లు సమస్యను విన్నవించినా పరిష్కారం మాత్రం లభించడం లేదు. దీంతో పాత పథకాలతో నీటిని సరఫరా చేస్తుండగా, విద్యుత్తు బిల్లులు తడిసి మోపెడవుతున్నాయని సర్పంచులు చెబుతున్నారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో సమస్యను విన్నవించగా, వాల్వ్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. పంపులు మరమ్మతు చేసి నాలుగింటి ద్వారా నీరు సరఫరా అయితే సమస్య తీరుతుందని అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంపులను త్వరగా మరమ్మతు చేయించి సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్తు బిల్లులు అధికం– జరుపుల శ్రీనివాస్, ఆత్మనగర్ సర్పంచిజిల్లాకు సరిపడా నీరు రాక సరఫరాలో సమస్య తలెత్తుతోంది. వచ్చిన నీటిని సర్దుబాటు చేసి ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా సరఫరా

# తాండూరులో కాలుష్య నమోదు కేంద్రం ఏదీ?



తాండూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా తాండూరులో దశాబ్దాలుగా వాయు కాలుష్యం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ వాయు నాణ్యత నమోదు కేంద్రం (ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్) ఏర్పాటు అవసరం ఉన్నప్పటికీ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) విస్మరించడంపై స్థానికంగా తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. పీసీబీ తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 27 వాయు నాణ్యత నమోదు కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం జిల్లా కేంద్రాలు, పెద్ద పట్టణాలను గుర్తించినా తాండూరు పేరు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడే అధికం ఎందుకంటే..ఖనిజాల ఖిల్లాగా పేరున్న తాండూరులో వందల కొద్ది నాపరాళ్ల గనులు, పలు సిమెంట కర్మాగారాలున్నాయి. నాపరాయిని నునుపుగా మార్చే పరిశ్రమలు 800 ఉన్నాయి. వీటికి తోడు సుద్దను పౌడరు, గుళికలుగా మార్చే పరిశ్రమలున్నాయి. కరణ్‌కోట, తాండూరు–చించోళి, – కొడంగల్, హైదరాబాద్, – సంగారెడ్డి రహదారులతో పాటు పట్టణం మీదుగా ప్రతిరోజు 6 వేల నుంచి 10 వేల లారీలు రాకపోకలు సాగిస్తాయి. ఇక్కడి రహదారులన్నీ 10 టన్నుల నుంచి 15 టన్నుల బరువు మోయడానికి డిజైన్ చేసినవి. కానీ ఒక్కో లారీ 40 నుంచి 60 టన్నుల బరువుతో వెళ్లడంతో రహదారులన్నీ ఎక్కడికక్కడ ధ్వంసమై పోతున్నాయి.

ఉపయోగమేమిటంటే..

పీల్చే గాలి స్వచ్ఛమైనదా, లేదా? కాలుష్య కారకాలు ఏమైనా ఉన్నాయా అనే విషయంలో స్పష్టత వస్తుంది. ఆమేరకు ప్రజల్ని అప్రమత్తం చేయవచ్చు. గాలి నాణ్యత 0.5 పాయింట్లు ఉంటే ఉత్తమం. 401 నుంచి 500 పాయింట్లు ఉంటే ప్రమాదకర పరిస్థితి. ఇంతకు మించి తాండూరులో వాయు కాలుష్యం నెలకొంది.

2015లో తొలిసారిగా కొలిచిన పీసీబీ

తాండూరు పట్టణంలో వాయు కాలుష్యం కారణంగా పట్టణ వాసులు అనారోగ్యాలకు గురౌతున్నారనే ఆందోళనతో 2015లో డిసెంబరు 17న తొలిసారిగా కాలుష్య నియంత్రణ మండలి వాయు కాలుష్యాన్ని కొలిచింది. ఇందుకోసం పట్టణంలోని లారీ పార్కింగ్ వద్ద ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. నేషనల్ యాంబియెంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్ లెక్కల ప్రకారం 100 పీఎం గాఢ%ళి%త 100లోపు ఉంటే సంతృప్తికరం. కానీ తాండూరులో నమోదైన వాయు కాలుష్యం మాత్రం 622గా నమోదైంది. అప్పట్లో నియంత్రణ యంత్రాలు ఏర్పాటు చేయాలని పీసీబీ నిర్ణయానికి వచ్చినా అది జరగలేదు. ఆ తర్వాత జాతీయ స్థాయి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వచ్చి పట్టణంలో కాలుష్యాన్ని పరిశీలించారు. నాణ్యత నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందని తేల్చారు. తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయారు.

ఎన్నెన్నో నష్టాలు..

వాహనాలు రాకపోకలు నిర్వహించిన ప్రతిసారీ దుమ్ము పైకి లేచి ప్రాణవాయువును కలుషితం చేస్తున్నాయి. ఈ గాలినే పీలుస్తున్న స్థానికులు చర్మవ్యాధులు, శ్వాసకోశ, నేత్ర, ఊపిరితిత్తుల వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇళ్ల పైకప్పులు, భారీ వృక్షాలు దుమ్ముతో పేరుకుపోతున్నాయి. రహదారుల వారగా పచ్చగా ఉండాల్సిన వృక్షాలు దుమ్మతో ఎర్రగా మారుతున్నాయి.

# అర్హతల్లేకున్నా సీనియర్ ప్రొఫెసర్లయ్యారు



హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయంటూ ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ప్రతినిధులు ప్రభుత్వానికి చేసిన ఫిర్యాదులు నిజమయ్యాయి. పదోన్నతులు పొందినవారి పరిశోధన పత్రాల వివరాలు కావాలంటూ కొందరు ప్రతినిధులు సమాచార హక్కు చట్టం ద్వారా ఓయూ నుంచి సమాచారం సేకరించగా ఆరుగురు ప్రొఫెసర్లు పదోన్నతికి అవసరమైన సంఖ్యలో పరిశోధన పత్రాలు సమర్పించలేదని వెల్లడైంది. సీనియర్ ప్రొఫెసర్ హోదా పొందిన ఒక ఆచార్యుడు.. తాను తప్పు చేశానంటూ రిజిస్ట్రార్‌కు లేఖ రాయడం అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు బలమైన ఆధారంగా నిలిచింది. ఈ ఆరుగురే కాకుండా మరో 50 మందికిపైగా ప్రొఫెసర్లకు 2022లో ఓయూ ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పదోన్నతుల కట్టబెట్టిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చాలామంది పరిశోధన పత్రాలకు యూజీసీ కేర్ గుర్తింపు లేదు.

వాస్తవాలివీ..ఇటీవలే పదవీ విరమణ పొంది ఉన్నత విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఒక విశ్రాంత ప్రొఫెసర్.. తాను 10 పరిశోధన పత్రాలను సమర్పించానంటూ నివేదికలో రాసుకున్నారు. వాటిలో 3 యూజీసీ కేర్ జాబితాలో లేవు. మరో రెండు పుస్తకాలుగా గుర్తించారు. ఒక పరిశోధన పత్రాన్ని తిరస్కరించారు.

ఒక విభాగంలో డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ 2015–2022 సంవత్సరాల మధ్య పది పరిశోధన పత్రాలు సమర్పించానంటూ నివేదికలో రాసుకున్నారు. ఇందులో 8 యూజీసీ వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. ఒకటి ఆన్‌లైన్‌లో లేదు.

భాషా విభాగాల్లో ఒక విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్న ఒక ప్రొఫెసర్.. సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందేందుకు అవసరమైన 10 పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమయ్యాయని తెలిపారు. కానీ వాస్తవానికి 3 మాత్రమే ప్రచురితమయ్యాయి.

ఒక మహిళా ప్రొఫెసర్ 10 పరిశోధన పత్రాలను సమర్పించినట్లు చెప్పినా సమర్పించింది 7 మాత్రమే. ఇందులో 2 ప్రచురితం కాలేదు.

అనర్హుల జాతకాలు బయటకు రావాలి

అర్హత లేకున్నా పదోన్నతులు పొందిన వారి జాతకాలు బయటకు రావాలి. విచారణ కమిటీ ఛైర్మన్ వేగంగా స్పందించాలి. అక్రమాలకు సంబంధించి మా వద్ద అన్ని రికార్డులు భద్రంగా ఉన్నాయి. ఓయూలో కొందరు అధికారులు తమకు నచ్చిన వారికే పదోన్నతులిచ్చి అర్హులైనవారికి మొండి చెయ్యి చూపించారు. తెరవెనుక ఉన్నవారిని శిక్షించాలి. ప్రొఫెసర్ మనోహర్, ఔటా అధ్యక్షుడు

# లేతప్రాయం.. మత్తుగాలం

హైదరాబాద్:నగరంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థి జేబు నుంచి పొట్లం తీసి మిత్రులకు చూపుతుండగా గమనించిన ఉపాధ్యాయుడు దాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఆ పొట్లంలో ఎండుగంజాయి ఉండడంతో నివ్వెరపోయాడు. పోలీసులు ఆ పిల్లాడ్ని ప్రశ్నించగా.. తమ కాలనీలో ఉండే యువకుడు వీటిని తన జేబులో భద్రపరుస్తాడని, అవసరం ఉన్నపుడు దాన్ని తీసుకెళ్లటం, మరొకరికి ఇవ్వమని పురమాయిస్తాడని సమాచారం. పాతబస్తీ నుంచి సరకు తెచ్చి పిల్లల వద్ద దాచి చేరవేస్తున్నట్లు తెలుస్తోంది.సికింద్రాబాద్ పరిధిలోని మరో పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులు సిగరెట్లకు అలవాటుపడ్డారు. పిల్లల వద్ద వాసన రావటం గమనించిన ఉపాధ్యాయురాలు వారి పుస్తకాల సంచులను పరిశీలించారు. వాటిలో గంజాయి, కొన్ని మాత్రలను ఉండటం గమనించి పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందజేశారు. విషయం బయటపడకుండా గోప్యంగా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం.

పసిప్రాయం మత్తు వలలో చిక్కుతోంది. నగరంలో కొత్తగా వెలుగుచూస్తున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల పోలీసుల తనిఖీలు, అరెస్టులతో భయపడిన అక్రమార్కులు మాదకద్రవ్యాల రవాణాకు కొత్తదారులు వెతుకుతున్నారు. డ్రగ్స్ సరఫరాకు బాలబాలికలను పావులుగా మలచుకుంటున్నారు. పాఠశాల విద్యార్థులైతే ఎవరికీ అనుమానం రాదనే ఉద్దేశంతో డబ్బు ఆశ, గంజాయి మైకం రుచిచూపి సరఫరా సాధనాలుగా మార్చుకుంటున్నారు. దూల్‌పేట్, మంగళ్‌హాట్, పాతబస్తీ ప్రాంతాల నుంచి కొందరు యువకులు 1–2 కిలోల చొప్పున గంజాయి కొనుగోలు చేస్తున్నారు. వాటిని 5, 10 గ్రాముల పొట్లాలుగా మార్చి పాఠశాల విద్యార్థుల దుస్తులు, సంచుల్లో భద్రపరుస్తున్నారు. కొనుగోలుదారులకు చేరవేసేందుకు కొన్నిసార్లు పిల్లల్ని సాధనంగా వినియోగించుకుంటున్నారు. పోలీసుల తనిఖీల్లేవని గుర్తించినపుడు స్వయంగా వారే ఆ ప్యాకెట్లను తీసుకెళ్తున్నారు. సహకరించిన



చిన్నారులకు రూ.100–200 వరకూ కమీషన్‌గా ఇస్తున్నారు. పెద్దమొత్తంలో చేరవేసినపుడు సెల్‌ఫోన్లు కొనిస్తున్నట్టు సమాచారం.

**రైలుపట్టాలు.. పై వంతెనలు**

కాలనీల్లో యువకులు, స్నేహితుల ప్రభావంతో పిల్లలు గంజాయికు దగ్గరవుతున్నారు. క్రమంగా బానిసలుగా మారుతున్నారు. పిల్లల బలహీనతను ఆసరా చేసుకున్న గంజాయి స్మగ్లర్లు ఉచితంగా సరకు ఇస్తామంటూ ఊబిలోకి లాగుతున్నట్లు గుర్తించామని నగరానికి చెందిన ఒక పోలీసు అధికారి తెలిపారు. సీతాఫల్‌మండీ, విద్యానగర్, అల్వాల్, చాంద్రాయణగుట్ట, లక్డీకపూల్, తదితర రైల్వేస్టేషన్లు, పైవంతెనల కింద ప్రాంతాలను అనువుగా మలచుకుంటున్నారు. ఇటీవల ఒక స్వచ్ఛంద సంస్థ గ్రేటర్ పరిధిలోని పలు కాలనీల్లో సుమారు 1000 మంది బాలబాలికల నుంచి మత్తుపదార్థాల వినియోగంపై సమాచారం రాబట్టారు. వారిలో 40శాతం మంది ఏదోఒక రూపంలో మత్తుకు అలవాటైన విషయం బయటపడటం బాల్యం ఎంత ప్రమాదంలో ఉందనేందుకు ఉదాహరణ.

# కంప్యూటర్లు.. దస్త్రాలే లక్ష్యం!

కరీంనగర్ : గతేడాది అక్టోబరు చివరి వారంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోకి దొంగ ప్రవేశించి కలెక్టరు వాడే ల్యాప్‌టాప్‌తోపాటు విలువైన సమాచారం ఉన్న పెన్‌డ్రైవ్ పక్కనే ఉన్న ఒక బ్యాగ్‌ను ఎత్తుకెళ్లాడు. సవాలుగా తీసుకున్న పోలీసులు విషయం బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తపడ్డారు. ఎట్టకేలకు కొన్నాళ్లకు ఒక దొంగను పట్టుకుని చోరీ సొత్తుని స్వాధీనపర్చుకున్నామని చూపించారు.గత నెల 25న కరీంనగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీ జరిగింది. చోరీకి పాల్పడిన వారు విలువైన దస్త్రాలను రికార్డు గదిలో నుంచి తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తెలిసింది.తిమ్మాపూర్ మండలంలోని నీటిపారుదలశాఖ డివిజన్ కార్యాలయంలో చోరీ జరిగింది. ఇక్కడి డివిజన్ నంబరు 5 కార్యాలయంలోని సీపీయూ, మానిటర్లు ఎత్తుకెళ్లడంతోపాటు పక్కనే ఉన్న మరో కార్యాలయంలోని దస్త్రాలను దొంగిలించే ప్రయత్నం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.ఎవరైనా దొంగతనానికి ఎందుకొస్తారు.. డబ్బు.. నగలు.. విలువైన వస్తువుల కోసం.. అదేంటో కానీ ఇటీవల కరీంనగర్ జిల్లాలో దొంగలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.. అక్కడి కంప్యూటర్లు.. దస్త్రాలను చోరీ చేస్తున్నారు.. అంతా డిజిటలీకరణ అయ్యింది.. వాటిని చోరీ చేయడం వల్ల సమాచారం ఎక్కడికీ పోదని అధికారులు చెబుతున్నా.. దొంగలకు వివిధ శాఖల కంప్యూటర్లు.. దస్త్రాలే ఎందుకు అవసరమన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.. సులువుగా చోరీ చేయవచ్చన్న అంచనాతో దొంగలు వస్తున్నారా.. లేక అవకతవకలు బయటకు రాకుండా చేసే ఇంటి ప్రయత్నాలా.. అని జనం సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

దస్త్రాలపై ధ్యాసేది : ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత హైదరాబాద్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో విలువైన దస్త్రాలు మాయమైన తీరుపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈ తరహాలోనే ఆయా శాఖల్లోని దస్త్రాల భద్రత విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో రెవెన్యూ శాఖలో చాలా వరకు దస్త్రాలు మాయమైన ఉదంతాలున్నాయి. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలామందికి సంబంధిత పత్రం అందుబాటులో లేదనే సమాధానమే వస్తోంది. భద్రతనే కీలకం : డిజిటలైజేషన్ విధానం నాలుగు జిల్లాల్లో అమలవు తున్నా.. అన్ని కార్యాలయాల్లో కాగితంతో కూడిన పత్రాల సమాచారం కీలకంగా మారుతుంది. భూ ప్రక్షాళన సమయంలో కరీంనగర్ సమీపంలోని బొమ్మకల్ మండలానికి సంబంధించిన కీలకమైన ప్రభుత్వ భూముల కాగితాలు మాయమయ్యాయి. ఇదే తరహాలో అక్కడక్కడా ముఖ్యమైన విభాగాలకు చెందిన కీలక పత్రాలకు ముప్పు వాటిల్లింది. కనిపించకుండా కొన్ని పత్రాలు మాయమైన ఉదంతాలపై కలెక్టర్లకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా నాలుగు జిల్లాల పరిధిలో దస్త్రాల భద్రత విషయంలో మరింత బాధ్యతగా అధికారులు వ్యవహరించాల్సిన అవసరముంది.

'నిఘా' కళ్లు నిర్వీర్యం : మూడేళ్ల కిందట సీసీ కెమెరాలు అంటేనే కరీంనగర్ కమిషనరేట్ అనే పేరుండేది.. ఎక్కడ చూసినా నిఘా కళ్ల పర్యవేక్షణ భద్రతకు భరోసాగా మారేది. కానీ నిర్వహణ లేక చాలా చోట్ల అవి ప్రస్తుతం నిరుపయోగంగానే ఉంటున్నాయి. పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు 15,138 ఉన్నాయి. ఇవే కాకుండా వ్యాపారులు, ప్రజలు ఏర్పాటు చేసుకున్నవి మరో 20వేల వరకున్నాయి. కార్యాలయాల్లో నిధుల సాకుతో నిర్వహణ సరిగ్గా చేపట్టడం లేదు. పోలీసులు ఏర్పాటు చేసినవాటికి కూడా నిర్వహణ భారంగా మారడంతో చేతులెత్తేశారు. దీంతో ఏర్పాటు చేసిన వాటిలో ఎన్ని పని చేస్తున్నాయనేది అధికారులకే లెక్క తెలియడం లేదు. పైగా ప్రతి కార్యాలయం వద్ద ఇవి ఉన్నా.. అవి దృశ్యాలను చిత్రీకరిస్తున్నాయా అనేది సందేహమే.!

పోలీసులకు సవాలే : వాస్తవానికి ఇళ్లలో, దేవాలయాల్లో జరుగుతున్న చోరీలే పోలీసులకు ఇబ్బందికరంగా మారుతుండగా కొత్తగా ప్రభుత్వ కార్యాలయాల్లో దొంగతనాలనేసరికి వారు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి వస్తోంది. ఇది ఇంటి దొంగల పనా? లేదా ఇంకేమైనా కోణం దాగి ఉందా? అనే విషయం వారికి సవాలుగా మారుతోంది. ఇప్పటికే గతేడాది సాధారణ చోరీల విషయంలో రికవరీ అనుకున్న పురోగతి లేదు. దొంగలపాలైన సొత్తు తిరిగి స్వాధీనమవలేదు. సర్కారు బదులు, వివిధ కార్యాలయాల్లో చోరీల విషయంలో అనుకున్న పురోగతి కనిపించలేదు. కరీంనగర్ జిల్లాలో గతేడాది 330 చోరీలు జరిగి రూ.2.12 కోట్ల సొత్తు మాయమైతే రూ.94.91 లక్షలు మాత్రమే రికవరీ కావడం గమనార్హం.

# పాల పంపిణీకి మార్గం సుగమం

ఖమ్మం : ఐదు నెలలుగా నిలిచిపోయిన విజయ డెయిరీ పాల పంపిణీ ప్రక్రియ తిరిగి ప్రారంభం కానుంది. పంపిణీ బాధ్యతను స్వాతి ఏజెన్సీకి అప్పగిస్తూ పాడిపరిశ్రమ సహకార సమాఖ్య ఎండీ ఉత్తర్వులను వెలువరించారు. ఖమ్మంలోని ప్రభుత్వ రంగసంస్థ విజయ డెయిరీ సేకరించిన పాలను గతేడాది ఆగస్టు వరకు ప్రభుత్వ విద్యాసంస్థలు, పార్లర్లు, ఇతర చిన్న దుకాణాలకు సూరజ్ ఏజెన్సీ సరఫరా చేసింది. టెండర్ గడువు పూర్తయిన తర్వాత తప్పుకొంది. అప్పటి నుంచి కొత్త టెండరుదారును పాడిపరిశ్రమ సహకార సమాఖ్య నియమించలేదు.

రెండు, మూడు రోజుల్లో..

సాంఘిక, వెనకబడిన, గిరిజన, మైనార్టీ గురుకులాలతో పాటు ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, సత్తుపల్లి, మధిర సబ్ జైళ్లు, ఐసీడీఎస్‌లకు విజయ డెయిరీ పాలు సరఫరా అవుతాయి. ఖమ్మం నగరంలోనే 20 పార్లర్లు ఉన్నాయి. వీటికి పాలు, పెరుగు సరఫరా అవుతాయి. రెండు, మూడు రోజుల్లో ఖమ్మం జిల్లాలో పాలు, పెరుగును స్వాతి ఏజెన్సీ సరఫరా చేయనుంది.

ఐదు నెలలుగా గుత్తేదారులు లేకపోవటంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రోజుకు సగటున 600– 800 లీటర్ల పాలు మాత్రమే అమ్ముడుపోయేవి. ప్రస్తుతం విజయ డెయిరీ ఉభయ జిల్లాల్లో నిత్యం 15వేల లీటర్ల పాలు సేకరిస్తోంది. ఇక్కడ విక్రయాలు లేకపోవటంతో సుమారు 14వేల లీటర్ల పాలను హైదరాబాద్‌కు అధికారులు పంపిస్తున్నారు. పాలు సరఫరా చేసే గుత్తేదారులు లేకపోవటంతో నెలకు రూ.కోటి వరకు జరిగే క్రయవిక్రయాలు రూ.20లక్షలకు పడిపోయాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతేడాది సెప్టెంబరు నుంచి గుత్తేదారు లేకపోవటంతో పాల సరఫరా నిలిచిపోయింది. ఇక్కడ టెండర్లు నిర్వహించి కొత్త గుత్తేదారును నియమించాల్సి ఉంది.ఖమ్మం జిల్లాలో విజయ డెయిరీ పాల సరఫరాకు కొత్త గుత్తేదారును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు వెలువరించారు. వీటిని సంబంధిత గుత్తేదారుకు అందించాం. జిల్లాలో పాలు, పెరుగు విక్రయాలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ డెయిరీ ఎదుట ఉన్న పార్లర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుత్తేదారుకు సంబంధించిన ప్రక్రియ త్వరలో పూర్తయ్యే అవకాశముంది.ఏ.కుమారస్వామి, ఉప సంచాలకుడు, విజయ డెయిరీ

# ప్రాణదాతలు

ఖమ్మం : రోడ్డు ప్రమాదాలు, ఇతర రుగ్మతలతో ఉన్నవారికి రక్తం అత్యవసరమవుతోంది. డబ్బులు పెట్టినా కొన్ని గ్రూపుల రక్తం సకాలంలో లభించదు. కొందరు పేదరికంలో రక్తం కొనలేని దయనీయ పరిస్థితి. ఇలా ఆపదలో ఉన్న వారి చెంతకే వెళ్లి రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలవుతున్నారు. ఒకటీ రెండు కాదు ఏళ్లుగా ఎంతో మందికి పునర్జన్మ ఇస్తూ సామాజిక బాధ్యతను చాటుతున్నారు. సత్తుపల్లి మండలంలో ఇరవై పర్యాయాలకు పైగా రక్తదానం చేసినవారు పలువురి మన్ననలు అందుకుంటున్నారు. మరోవైపు ఇతరుల్లో అవగాహన కల్పిస్తూ అపోహలు తొలగిస్తూ వారిని సైతం ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా దాతల స్ఫూర్తిదాయక సేవలపై ప్రత్యేక కథనం.

**జీవితకాలం కొనసాగిస్తా: కె.నాగేశ్వరరావు, రుద్రాక్షపల్లి**

నాది 'ఓ' పాజిటివ్ రక్తం. ఇప్పటివరకు ఇరవై సార్లు రక్తదానం చేశాను. అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్న వారిని చూసి చలించిపోయి రక్తాన్ని దానం చేయడం ప్రారంభించాను. చాలా మందికి వారివారి బ్లడ్ గ్రూపు తెలియదు. ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపును తెలుసుకోవాలి. వేరే గ్రూపు రక్తం కావాలన్నా వెంటనే స్పందించి దాతలను చూపించి సహాయం చేస్తున్నా. నా జీవిత కాలం దీన్ని కొనసాగిస్తా.

**ఒక్క ప్రాణం కాపాడినా జన్మధన్యమే: షేక్.రహీంపాషా, కాకర్లపల్లి**

రక్తాన్ని దానం చేసి ఒక్క ప్రాణాన్ని కాపాడిన జన్మధన్యమే కదా అనే



ఉద్దేశంతో ఇప్పటి వరకు 31 సార్లు రక్తాన్ని దానం చేశా. నాది 'ఏ' పాజిటివ్. ఏ సమయంలోనైనా రక్తం కావాలని కోరితే ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నా. హైదరాబాద్, విజయవాడ, ఖమ్మంలాంటి ప్రాంతాలకు వెళ్లి రక్తాన్ని దానం చేశాను. దీనివల్ల వల్ల ఎంతో సంతృప్తి పొందుతున్నాను.

**ఇతరుల ప్రాణాలను కాపాడాలనే..ఆర్.జనార్దన్ గుప్తా, ఖమ్మం**

నాకు ఇప్పుడు 41 సంవత్సరాలు. 18 ఏళ్ల నుంచి రక్తదానం చేస్తున్నాను. ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున ఇప్పటి వరకు 54 సార్లు దానం చేశా. అత్యవసర సమయంలో 20 మందికి రక్తం ఇచ్చాను. రక్తదాతలను ప్రోత్సహించేందుకు రెడ్‌క్రాస్, వాసవీ, లయన్స్ క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. గతంలో కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నాను. నేడు గవర్నర్ అవార్డుకు ఎంపికయ్యాను.

**ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని..టి.సురేశ్, వైరా సీఐ**

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే ఆలోచనతోనే రక్తదానం చేస్తున్నా. నిల్వ చేసి వినియోగించుకునే అవకాశం ఉంది. శిబిరాలు ఎక్కడ ఏర్పాటు చేసినా తప్పకుండా హాజరవుతా. 16 ఏళ్ల నుంచి చేస్తున్నా. ఇప్పటి వరకు 35 సార్లు రక్తం ఇచ్చాను. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ప్రాణదాతలుగా నిలవాలి.

**మూడు నెలల తర్వాత మళ్లీ ఇవ్వొచ్చు..కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్,సీహెచ్‌సీ, సత్తుపల్లి**

సాధారణంగా 18 నుంచి 45 ఏళ్లలోపు వారితోపాటు పూర్తి ఆరోగ్యంగా ఉన్న 65 ఏళ్లలోపు వారు రక్తాన్ని ఇవ్వొచ్చు. రక్తం ఇచ్చిన మూడు నెలల తర్వాతే ఇవ్వాల్సి ఉంటుంది. అపోహలు మాని ప్రతి ఒక్కరూ రక్తాన్ని దానం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలి.

# సీతమ్మసాగర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నేడు

ఖమ్మం : సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నారు. అశ్వాపురంలోని దోసపాటి రంగారావు, భారతి వర్తక సంఘం కల్యాణ మండపంలో జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సీతమ్మసాగర్ ప్రభావిత దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు మండలాల రైతులు, ప్రజలు హాజరుకానున్నారు. పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, పొదెం వీరయ్య, జలవనరులశాఖ సీఈ ఎ.శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం, భద్రాచలం ఎస్ఈలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రవీందర్ ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

**వీడియో చిత్రీకరణ..** సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకత, దీనివల్ల కలిగే ప్రయోజనాల గురించి జలవనరులశాఖ అధికారులు వివరించనున్నారు. ఎమ్మెల్యేలు, రైతులు, ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేస్తారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు వీడియో తీయనున్నారు. పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మసాగర్‌ను నిర్మిస్తున్నారంటూ దుమ్ముగూడెం మండలానికి చెందిన కొందరు ఈ ఏడాది మార్చిలో చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)ని ఆశ్రయించిన విషయం విదితమే. 'సీతమ్మసాగర్'ను నిలిపివేయాలని, అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే నిర్మించాలని ఎన్‌జీటీ సూచించింది. సీతమ్మసాగర్ పనులను నిలిపేయటం లేదని ఫిర్యాదుదారులు మళ్లీ ఎన్‌జీటీని ఆశ్రయించారు. నిజానిజాలను నిర్ధారించేందుకు ఇటీవల ద్విసభ్య కమిటీని ఎన్‌జీటీ నియమించింది. వీటన్నింటి నేపథ్యంలో జలవనరులశాఖ అదికారులు సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు పొందేందుకు కసరత్తు మొదలుపెట్టారు. అందులో భాగంగానే ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకున్నారు.

# సర్దుబాటుతో సమస్యకు పరిష్కారం




ఖమ్మం : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విద్యాశాఖ చర్యలు చేపట్టింది. కలెక్టర్ల సూచనల ప్రకారం పని సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్)కు సంబంధించిన ప్రతిపాదనలు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 20 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉభయ జిల్లాల్లోని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యా వాలంటీర్ల నియామక ప్రక్రియ నిలిచిపోయిన తర్వాత రెండేళ్లుగా 'సర్దుబాటు' పేరిట నెట్టుకొస్తున్నారు. ఖాళీలు భర్తీ కాకపోవటం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ చేయకపోవటంతో ఉన్నత పాఠశాలల్లో పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయి. గత ఏడాది విద్యా సంవత్సరం మధ్యలో ప్రారంభించిన ఈ ప్రక్రియ కొంత వరకు సత్ఫలితాలను ఇచ్చింది. అందుకే ఈసారి విద్యాసంవత్సరం ఆరంభంలోనే ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ముందుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా సర్దుబాటు చేయనుంది.

**ఎంఈఓల నుంచి జిల్లాకు చేరిన ప్రతిపాదనలు...**

ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేసే స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తారు. ఇప్పటికే ఎంఈఓలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందుకోసం తగిన మార్గదర్శకాలను రూపొందించారు. వీటి ప్రకారం తొలుత స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో, అక్కడ అవసరమైన ఉపాధ్యాయుడు లేకుంటే మండలంలో ఉన్న వారికి, అక్కడా లేకుంటే సమీప మండలం నుంచి సర్దుబాటు చేస్తారు. ఎంఈఓల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ అనుమతి తీసుకుని అమలు చేస్తారు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానంగా తెలుగు, వృక్షశాస్త్ర ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవటంతో దాని ప్రభావం పదో తరగతి ఫలితాలపై పడుతుందనే ఉద్దేశంతో ఈసారి విద్యాశాఖ ముందే మేల్కొనటం విశేషం.

**317 జీఓతో తొలగిన ఇబ్బందులు...**

గతంలో పాఠశాలలు పునః ప్రారంభమయ్యేనాటికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని మారుమూల మండలాల్లోని అనేక బడులను తెరిచేందుకు ఉపాధ్యాయులే ఉండేవారు కాదు. ఈసారి 317 జీఓ వల్ల ఏజెన్సీతో పాటు మారుమూల ప్రాంతాల్లో సైతం ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశారు. ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, ఎర్రుపాలెం, వేంసూరు, భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం పరిసర మండలాల్లో ఉపాధ్యాయుల కొరత ఉండేది.

**సంఘాల నుంచి మిశ్రమ స్పందన...**

కొద్ది రోజుల నుంచి 'పని సర్దుబాటు'కు సంబంధించి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రాథమిక పాఠశాలలు దెబ్బతినకుండా చూడాలని కొందరు, దివ్యాంగ ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారిని దృష్టిలో ఉంచుకుని సర్దుబాటు చేయాలని మరికొందరు కోరుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు పక్కనున్న పాఠశాలలకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాం. కలెక్టర్ అనుమతి తీసుకున్న అనంతరం ఈనెల 20 నాటికి ఖాళీ పోస్టుల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమిస్తాం. సోమశేఖరశర్మ, డీఈవో ఖమ్మం,ఇన్‌ఛార్జి భద్రాద్రి కొత్తగూడెం

# ఆదిలోనే అడ్డంకులు!



వరంగల్ : పదేళ్లుగా అంతర్ వలయ రహదారికి అడ్డంకులు తప్పడం లేదు. పనులు ప్రారంభించే సమయానికి ఏదో ఒక సమస్య వెంటాడుతోంది. రెండు, మూడు రోజులుగా భూసేకరణపై ప్రైవేటు వ్యక్తులు నిరసన తెలుపుతున్నారు. క్షేత్రస్థాయిలో పనులు ఆపుతున్నారు. ఒక అడుగు ముందుకేసి ఈనెల 17న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపనను అడ్డుకుంటామని ప్రకటించారు. భూములిచ్చిన రైతులుకు నగదు ఇవ్వడం లేదని ప్రధానంగా ఆరోపిస్తున్నారు. ఇన్నర్ రింగురోడ్డు భూసేకరణపై కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, వరంగల్ జిల్లా రెవెన్యూ శాఖాధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే ఇబ్బందులొస్తున్నాయని తెలిసింది. 70 శాతం భూసేకరణ పూర్తయిందని, ఖిలావరంగల్ తూర్పు కోట శివారు భూములపై ప్రైవేటు వ్యక్తుల మధ్య పేచీ తలెత్తడం వల్ల మిగిలిన 30 శాతం ఆగిందని కుడా అధికారులంటున్నారు. భూసేకరణ సమస్యలు పరిష్కరించాల్సిన రెవెన్యూ శాఖాధికారులు మౌనంగా ఉండటంతో ఆందోళన చేపట్టారు.'

**70-75 ఎకరాలు పూర్తి**

అంతర్ వలయ రహదారి తొలి విడత రంగశాయిపేట నాయుడు పంపు నుంచి జానీపీరీలు, కీర్తినగర్, ఎనుమాముల వరకు సుమారు 8-9 కిలోమీటర్లు ప్రతిపాదించారు. మొత్తం 80-9 0 ఎకరాలు ప్రైవేటు భూములు సేకరించే లక్ష్యం ఉంది. వరంగల్ అర్బన్ జిల్లాగా ఉన్నప్పుడే భూసేకరణకు కుడా ఆర్డీవో వద్ద సుమారు రూ. 75కోట్లు డిపాజిటు చేసింది. 70-75 ఎకరాల వరకు ప్రైవేటు భూముల సేకరణ పూర్తయింది. ఇంకా 10-15 ఎకరాలు పెండింగ్‌లో ఉంది. ఖిలావరంగల్ తూర్పు కోట శివారు భూముల దస్తావేజులు, యాజమాన్యపు హక్కులపై వివాదాలు తలెత్తాయి. దీంతో భూసేకరణ ఆగింది. ఖిలావరంగల్ తూర్పు కోట శివారు, ఇతర ప్రాంతాల్లో భూసేకరణ చేసేందుకు వరంగల్ ఆర్డీవో రీ నోటిఫికేషన్ ఇవ్వాలి. యజమాని పేరు, సర్వేనంబర్లు పొందుపరుస్తారు. సమస్యలుంటే బయటకొస్తాయి. రీ నోటిఫికేషన్ ఇచ్చే విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయ లోపం ఉందంటున్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కుడా ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. కలెక్టర్ దృష్టి సారిస్తే రైతుల సమస్యలు తీరుతాయంటున్నారు. ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటాంఅంతర వలయ రహదారి ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటామని బాధిత భూ పోరాట సంఘ సభ్యులు హెచ్చరించారు. ఖిలావరంగల్‌లో పరిహారం అందని భూ బాధితులు నిరసనకు దిగారు. వెంటనే తమకు పరిహారం చెల్లించాలని ప్లకార్డులు చేత పట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని నినాదాలు చేశారు. నాయుడు పెట్రోల్ పంపు కూడలి నుంచి ఖిలావరంగల్, చింతల్ మీదుగా భూ సేకరణలో 300 మంది బాధితులు ఉన్నారని ఇందులో 150 మందికి పరిహారం చెల్లించగా మరో 150 మందికి చెల్లించకుండా పనులు మొదలు పెట్టడం శోచనీయమన్నారు. ఈనెల 17న మంత్రి కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపాదికన రింగ్‌రోడ్ శిలాఫలకానికి శంకుస్థాపన చేయించేందుకు తాత్కాలిక పనులు చేపట్టారు. అధికారు లు స్పందించకుంటే ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటామని భూ బాధితుల సమాఖ్య అధ్యక్షుడు గంగుల దయాకర్ హెచ్చరించారు. వెంకటరమణ, సారయ్య, ఉమాశంకర్‌గౌడ్, రియాజుద్దీన్, సత్యనారాయణ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

# తలాపునే వైద్యం.. కేటాయింపులో చోద్యం

కామారెడ్డి : వైద్యసేవలను పేదప్రజలకు అందించేందుకు పల్లెదవాఖానాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ప్రత్యేక సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చుతోంది. జిల్లాలో మాత్రం పీహెచ్‌సీల పరిధి మార్పు(గ్రామాల రేషనలైజేషన్)పై జిల్లా వైద్యశాఖ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాజంపేట మండలంలోని 12 గ్రామాల ప్రజలతో పాటు భిక్కనూరు మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తీరుపై ప్రత్యేక కథనం.

**నివేదించినా ప్రయోజనం శూన్యం** 2016లో తాడ్వాయి మండలంలోని 12 గ్రామాలు, భిక్కనూరు మండలంలోని 8 గ్రామాలతో రాజంపేట మండలంగా ఏర్పాటైంది. ఇంతకు పూర్వమే రాజంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల పరిధి మార్పుపై మండలాల ఏర్పాటుకు ముందే స్థానిక ప్రజాప్రతినిధులు, భిక్కనూరు, రాజంపేట మండల సభలు సైతం ప్రభుత్వానికి, వైద్యశాఖకు నివేదించాయి. పరిధి మార్పు మాత్రం జరగడం లేదు. కొందరు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు పీహెచ్‌సీల పరిధి మార్పు జరగకుండా అడ్డుపడుతున్నారనే ఆరోపణలున్నాయి. సుదూర ఆరోగ్య కేంద్రాల్లో సేవలురాజంపేట మండలంలోని కొండాపూర్, ఆర్గొండ, బస్వన్నపల్లి, అన్నారం తండా, గుడి తండా, శేర్‌శంకర్ తండా, ఎల్లారెడ్డిపల్లి తండా, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, నడిమితండా, ఎల్లాపూర్ తండా, సిద్ధాపూర్ గ్రామాల ప్రజలకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సమీపంలో ఉంటుంది. ప్రస్తుతం పీహెచ్‌సీల పరిధి మార్పిడి చేయకపోవడంతో వీరికి ఎర్రాపహాడ్‌లో మాత్రమే నిర్దేశిత వైద్యసేవలు అందిస్తున్నారు. భిక్కనూరు మండలంలోని అంతంపల్లి, జంగంపల్లి, లక్ష్మీనగర్ తండా, తిప్పాపూర్ గ్రామాల వైద్యసేవల పరిధిని రాజంపేట పీహెచ్‌సీగా నిర్ధరించారు. ఈ గ్రామాలకు సమీపంలోనే భిక్కనూరు పీహెచ్‌సీ ఉంటుంది. రాజంపేట మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన ప్రజలు ఎర్రాపహాడ్ పీహెచ్‌సీకి వెళ్లాలంటే సుమారు 45 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కొండాపూర్, ఆర్గొండ, బస్వన్నపల్లి వాసులు సైతం సదరు ఆరోగ్యకేంద్రానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేక సమస్యగా మారింది. రాజంపేట పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యసేవలతోనే సరిపెడుతున్నారు. గర్భిణులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు.

ఎర్రాపహాడ్‌కు వెళ్లాల్సి వస్తోంది- మనీష, ఆర్గొండ, రాజంపేటప్రాథమిక వైద్యసేవలు మినహా ఇతరత్రా వైద్యసేవల నిమిత్తం ఎర్రాపహాడ్ పీహెచ్‌సీకే వెళ్లాల్సి వస్తోంది. సుమారు 40 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. సమీపంలోని రాజంపేట పీహెచ్‌సీ పరిధిలో మా గ్రామం లేక సమస్యలు తలెత్తుతున్నాయి.

# పైపైన పూడికతీత!

వరంగల్ :వరంగల్ త్రినగరాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. వరద నీరు పారే నాలాలు, ప్రధాన మురుగు కాల్వల్లో పూడికతీత పనుల పై పైన జరిగాయి. ఎక్కడ చూసినా అసంపూర్తి పనులే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లోని నాలాలు శుభ్రం చేశారు. లోపలి వైపు ఉన్న వాటిని వదిలి పెట్టారు. చాలా ప్రాంతాల్లో నాలాలు, మురుగు కాల్వల నిండా వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇలాగైతే వరదనీరు ఎలా వెళ్తుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలానికి సర్వం సిద్ధమని బల్దియా పాలకులు, అధికారులు గొప్పలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పూడికతీత పనులు పైపైన జరిగినట్లు కనిపిస్తోంది. ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు పూడికతీత పనులు మమ అనిపించారు. బల్దియా సాధారణ నిధులు సుమారు రూ. 1.78 కోట్లతో 33 నాలాల పూడికతీత పనులు ప్రతిపాదించారు. 15-18 నాలాల్లో పూడికతీత పనులు పూర్తిగా జరిగాయి. మిగిలినవి సగం సగం చేసి వదిలేశారనే విమర్శలున్నాయి.

**ఇవిగో సాక్ష్యాలు**

హంటర్ రోడ్ 12 మోరీల నాలా పనులు సగమే జరిగాయి. ప్రధాన రోడ్డు కల్వర్టు కింద వ్యర్థాలు, మట్టి పేరుకుపోయింది.

వరంగల్ పోతననగర్ నుంచి కాకతీయ మ్యూజికల్ గార్డెన్ వరకు భద్రకాళి నాలాలో పూడికతీత పనులే జరగలేదని స్థానికులంటున్నారు.

బల్దియా ఇండోర్ స్టేడియం వైపు వ్యర్థాలున్నాయి.

మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్ రామన్నపేట పెద్దమోరీ, రఘునాథ్ కాలనీ మురుగు కాల్వలో వ్యర్థాలు ఆగాయి. పూడికతీత పనులు చేపట్టలేదు.



వరంగల్ కాశీబుగ్గ నుంచి ఎల్బీనగర్ మీదుగా తిలక్ రోడ్‌కు వచ్చే ప్రధాన మురుగు కాల్వలో వ్యర్థాలున్నాయి. పూడికతీత పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తుమ్మలకుంట 80 అడుగుల రోడ్డు నుంచి ఆటోనగర్ మీదుగా కేఎల్‌మహేంద్రనగర్ వరకు ప్రధాన డ్రైనేజీలో వ్యర్థాలున్నాయి.

హనుమకొండ కాపువాడ నుంచి అలంకార్ కూడలికి వచ్చే పెద్ద మోరీలో వ్యర్థాలున్నాయి.

కాకతీయ కాలనీ, మచిలీబజారు, రాయపుర, రెడ్డి కాలనీ, ఈద్గా రోడ్ ప్రధాన కాల్వలో పూడికతీత పనులు చేపట్టలేదు.

హనుమకొండలో కీలకమైన నయీంనగర్ నాలాలో నాలుగు వెంట్లు ఉంటే, ఒకే ఒక వెంటు క్లియర్ చేశారు. మిగిలిన మూడు వదిలేశారు.

**అన్నీ చేయాల్సిందే..**

**గుండు సుధారాణి, మేయర్ గ్రేటర్ వరంగల్**

నాలాలు, ప్రధాన మురుగు కాల్వల్లో వ్యర్థాలు క్లియర్ చేయాల్సిందే. వంద శాతం పనులు చేస్తేనే బిల్లు చెల్లిస్తాం. సగం చేస్తే బిల్లు ఇచ్చేది లేదు. క్షేత్రస్థాయిలో నాలాలు పరిశీలిస్తాం. అన్ని చూశాకే ఎంబీ రికార్డు చేయాలని ఇంజినీర్లను కోరాను.

# హరితోత్సవానికి వేళాయే..

పెద్దపల్లి : జిల్లాలో తొమ్మిదో విడత హరితహారం మొక్కలు నాటేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఏటా వర్షాలు కురిసిన తర్వాత మొక్కలు నాటేవారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న 'హరితోత్సవం' పేరిట మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 31.64 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. కాగా గ్రామాల్లో గుంతల తవ్వకాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో 31 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యం విధించారు. గ్రామీణాభివృద్ధిశాఖ 16.50 లక్షలు నాటనున్నారు. అటవీ 1.40 లక్షలు, రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు 5.02 లక్షలు, మిగిలిన 8.08 లక్షలు ఇతర శాఖలు నాటనున్నాయి. ఈ ఏడాది టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటనున్నారు.

**సర్కారు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా..**



జిల్లాలో నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణానికి సేకరించిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ముఖ్యంగా ఎస్సారెస్పీ భూములు కబ్జాకు గురవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ స్థలాలనూ అక్రమార్కులు వదలడం లేదు. ఈ సారి ప్రభుత్వ స్థలాలను రక్షించేందుకు అవసరాల నిమిత్తం సేకరించిన భూముల్లో మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు దస్త్రాల ఆధారంగా క్షేత్ర స్థాయిలో హద్దులు నిర్ణయించి మొక్కలు నాటేందుకు జాబితా సిద్ధం చేశారు.

**శరవేగంగా గుంతల తవ్వకాలు**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ కూలీలు మొక్కలు నాటేందుకు శరవేగంగా గుంతల తవ్వకాల పనులు చేపడుతున్నారు. ఈ నెల 19న మొక్కల నాటే కార్యక్రమం ప్రారంభంకానుండటతో రోజువారీగా గుంతల తవ్వకాల లక్ష్యాలు విధించారు. అయితే నర్సరీల్లో మొక్కల ఎదుగుదల ఆందోళన కలిగిస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడమే దీనికి కారణం.

**మొక్కల కొరత లేదు**

దశాబ్ది ఉత్సవాల్లో హరితోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటనున్నాం. నర్సరీల్లో పెద్ద సైజ్‌లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి కొరత లేదు. వేసవిలో నర్సరీల్లో మొక్కల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. శ్రీధర్, గ్రామీణాభివృద్ధి అధికారి




దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైనట్లు తెలుస్తోంది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఈ సమావేశాలను నిర్వహించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు గురువారం వెల్లడించాయి. తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించనున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సభలో ప్రవేశపెడతారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చే చివరి పద్దు ఇది. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రం ఈసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. అంటే కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు చేయాల్సిన ఖర్చులకు పార్లమెంట్ ఆమోదం తీసుకోవడమే. బ్రిటీష్ కాలం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈసారి ఆకర్షణీయమైన ప్రకటనలు, విధానపరంగా కీలకమైన మార్పులు ఉండకపోవచ్చని ఇప్పటికే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంకేతాలిచ్చారు. అయితే, ఎన్నికల ముందు మహిళా రైతులకు కేంద్రం ఈ బడ్జెట్ సమావేశాల్లో శుభవార్త చెప్పే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వీరికి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి మొత్తాన్ని రెట్టింపు చేసే ప్రతిపాదనలు ఉండొచ్చు. ఇటీవల శీతాకాల సమావేశాల్లో దుండగులు రంగుల పొగతో సృష్టించిన అలజడి పార్లమెంట్ భద్రతపై ఆందోళనలు రేపిన విషయం తెలిసిందే. దీంతో ఈ సారి భద్రతను కట్టుదిట్టం చేశారు.




## ఏపీలో మూడు కొత్త రైళ్ల ప్రారంభం

గుంటూరు : రాష్ట్రానికి కొత్త రైళ్లు వచ్చేశాయి. మూడు రైళ్లను శుక్రవారం గుంటూరు స్టేషన్ నుంచి ప్రారంభించనుంది రైల్వే శాఖ. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ఇవి పట్టాలపై ఎక్కనున్నాయి. హుబ్బళ్లి - నర్సాపూర్, విశాఖపట్టణం - గుంటూరు, నంద్యాల - రేణిగుంట రైళ్లను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తారు. రేపటి నుంచే ప్రయాణికులకు ఈ రైళ్ల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## లోకేశ్ సమక్షంలో తెదేపాలో చేరిన కర్నూలు వైకాపా నేతలు



అమరావతి: కర్నూలుకు చెందిన పలువురు వైకాపా నేతలు తెదేపాలో చేరారు. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కర్నూలు 17వ డివిజన్ కార్పొరేటర్ క్రైపా పద్మాలతా రెడ్డి, కేవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ అధినేత సుబ్బారెడ్డి, క్రైపా అశోక్ కుమార్‌రెడ్డి తదితరులు వైకాపాకు రాజీనామా చేసి తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. జిల్లాలో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని లోకేశ్ వారికి సూచించారు. తెదేపాతోనే కర్నూలు జిల్లా అభివృద్ధి సాధ్యమని నేతలు చెప్పారు. వైకాపా ప్రభుత్వ వేధింపులతో జిల్లాకు వచ్చిన పరిశ్రమలు వెనక్కి వెళ్లాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.




విజయవాడ: ఎంపీ కేశినేని నాని ఎన్ని అంటున్నా 1999 నుంచి తానే సర్దుకుపోతూ వచ్చానని ఆయన సోదరుడు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. తమ కుటుంబంలో అప్పటి నుంచి కలహాలు ఉన్నాయని.. వాటితో తెదేపాకు, అధినేత చంద్రబాబుకు సంబంధమేంటని ప్రశ్నించారు. బుధవారం సీఎం జగన్‌ను కలిసిన అనంతరం కేశినేని నాని విమర్శలు చేసిన నేపథ్యంలో చిన్ని స్పందించారు. “మా కుటుంబంలో దశాబ్దాలుగా సమస్యలు ఉన్నాయి. ఎంపీ టికెట్ ఇచ్చి రెండుసార్లు ఆదరించిన నందమూరి, నారా కుటుంబాలను విమర్శించే స్థాయి కేశినేని నానికి లేదు. అమరావతిని సర్వనాశనం చేసిన జగన్ చెంతకు ఆయన చేరడాన్ని విజయవాడ ప్రజలు హర్షించరు. చంద్రబాబు పెట్టిన రాజకీయ భిక్షను మరచి మాట్లాడటం తగదు. స్టిక్కర్ గురించి నా భార్యపై మీరు దొంగ కేసు పెట్టారు. కుటుంబం, పార్టీ విషయాలు కలపకూడదని ఏరోజూ నేను మాట్లా డలేదు. ‘యువగళం’ పాదయాత్రలో నారా లోకేశ్ వెంట లక్షలాది మంది ప్రజలు, కార్యకర్తలు నడిచారు. విజయవాడకు హెచ్‌సీఎల్ సహా ఎన్నో సంస్థలు వచ్చాయంటే దానికి ఆయనే కారణం. ఎంతోమం ది మహామహులు వీడినా తెదేపాకు ఏమీ కాలేదు. వచ్చేవాళ్లు వస్తుంటారు.. పోయేవాళ్లు పోతుంటారు” అని కేశినేని చిన్ని వ్యాఖ్యానించారు.




## సీఎం జగన్‌ను కేశినేని కలవడంపై పీవీపీ సెటైర్.. మామూలుగా లేదుగా..!

అమరావతి: ఎంపీ కేశినేని నానిపై వైసీపీ నేత పొట్లూరి వరప్రసాద్ (పీవీపీ) పరోక్షంగా విమర్శలు గుప్పించారు. బోరుకొచ్చిన బండి షెడ్డు మారిందంటూ ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. నాని బుద్ధి గురించి బెజవాడంతా తెలుసని పేర్కొన్నారు. “బోరుకొచ్చిన బండి షెడ్డు మారిందంతే.. వీడి బుద్ధి గురించి బెజవాడంతా తెలుసుకదరా అబ్బాయ్” అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

**ఇందుకే రచ్చ! :** విజయవాడ ఎంపీ పదవికి, టీడీపీకి రాజీనామా చేస్తానని ప్రకటించిన కేశినేని నాని ప్రకటించిన వెంటనే కూడా పీవీపీ ఆయనపై విమర్శలు గుప్పించారు. కేశినేని నాని బెజవాడకే గుదిబండలా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు కేశినేని నాని బండిని లాక్కొచ్చారంటే అది టీడీపీ చలవతోనేనన్నారు. బ్యాంకులను బాది, ప్రజలను, ఉద్యోగులను కేశినేని నాని పీల్చి పిప్పి చేశారన్నారు. ఇప్పుడు కేశినేని నాని జగన్‌ను కలిశారనగానే మరోసారి పీవీపీ ఎక్స్ వేదికగా తనదైన స్టైల్లో స్పందించారు.

**కనిపించరేం! :** అయితే 2019 ఎన్నికల్లో కేశినేని నానిపై వైసీపీ నుంచి పీవీపీ పోటీ చేసి ఓడిన విషయం తెలిసిందే. అయితే ఇద్దరికీ మధ్య పెద్ద తేడా ఏమీ లేదు.

కేవలం నాని 8,726 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల తర్వాత పీవీపీ పెద్దగా ఎక్కడా కనిపించలేదు. పార్టీ అధికారంలోకి ఉన్నప్పటికీ ఆయన మాత్రం అడ్రస్ లేరు. ఇప్పుడు ప్రత్యర్థి కాస్త సొంత పార్టీలోకి రావడంతో పీవీపీ రగలిపోతున్నట్లు ఈ ట్వీట్‌ను బట్టి చూస్తే స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.




## తల్లీకుమారులపై అభ్యంతరకర వీడియోలు.. యూట్యూబ్ ఇండియాకు సమన్లు

దిల్లీ: ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ వేదిక యూట్యూబ్‌లో కొన్ని ఛానళ్లు.. తల్లులు, కుమారులకు సంబంధించి అసభ్యకర వీడియోలను పోస్ట్ చేస్తుండటంపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై యూట్యూబ్ ఇండియాకు సమన్లు జారీ చేసింది. జనవరి 15న ఆయా ఛానళ్ల జాబితాతో ఆ సంస్థ ప్రతినిధి తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు భారత్‌లోని యూట్యూబ్ పబ్లిక్ పాలసీ హెడ్ మీరా ఛాట్‌కు.. కమిషన్ లేఖ రాసింది. “ఇలాంటి వీడియోలు చిన్నారుల భద్రత, శ్రేయస్సుకు హాని కలిగించే ప్రమాదం ఉంది. వీటిని మైనర్లు కూడా వీక్షించేందుకు అనుమతించడం మరింత ఆందోళనకరం” అని కమిషన్ లేఖలో పేర్కొంది. అసభ్యకర కంటెంట్‌ను తమ మాధ్యమం నుంచి తొలగించేందుకు ఎలాంటి మెకానిజం వినియోగిస్తున్నారో చెప్పాలని యూట్యూబ్‌ను ఆదేశించింది. సమన్లకు స్పందించకపోతే అరెస్టును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై కమిషన్ చీఫ్ ప్రియాంక్ కనూంగో మాట్లాడుతూ.. “తల్లులు, యుక్తవయసు కుమారుల మధ్య అసభ్యకర సన్నివేశాలతో కొన్ని ఛానళ్లు వీడియోలను విడుదల చేస్తున్నాయి. ఇవి పోక్సో చట్టం ఉల్లంఘన కిందకు వస్తాయి. ఇలాంటి వీడియోలతో వ్యాపారం చేయడం.. అశ్లీల దృశ్యాలను అమ్మడం లాంటిదే. దీనిపై యూట్యూబ్ చర్యలు తీసుకోవాలి. ఇలాంటి దారుణాలకు పాల్పడే వారిని జైలుకు పంపించాలి” అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## భారతదేశంలో అతి పొడవైన వంతెన.. ప్రారంభించనున్న ప్రధాని మోదీ

భారతదేశంలో పొడవైన సముద్ర వంతెన నిర్మాణం పూర్తయింది. ముంబయి నుంచి నవీ ముంబయిని కలుపుతూ 22 కిలోమీటర్ల పొడవుతో నిర్మించిన ఈ బ్రిడ్జిని ప్రధాని నరేంద్ర మోడీ జనవరి 12 న ప్రారంభించనున్నారు. దీంతో దక్షిణ ముంబయి నుంచి నవీ ముంబయికి కేవలం 20 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ఈ వంతెనపై అన్ని రకాల వాహనాలు నడిచేందుకు అనుమతి లేదని అధికారులు వెల్లడించారు. ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్ లో నాలుగు చక్రాల వాహనాల గరిష్ఠ వేగ పరిమితి గంటకు 100 కిమీగా ఉంటుందని ముంబయి పోలీసులు తెలిపారు. ఈ వంతెనపై మోటార్ బైక్‌లు, ఆటో రిక్షాలు, ట్రాక్టర్లు వెళ్లేందుకు అనుమతి లేదు. ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పేరు మీదుగా ఈ బ్రిడ్జికి అటల్ సేతు అని నామకరణం చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. దీనిని జనవరి 12 న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. వంతెన ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వాహనాల వేగ పరిమితి గంటకు 40 కి.మీ.లుగా ఉండనుంది. అసౌకర్యాలు, ప్రమాదాలు, అడ్డంకులు తలెత్తకుండా ఉండేందుకు ఈ వంతెనను నిర్మించినట్లు ఓ అధికారి తెలిపారు. రూ.18,000 కోట్లతో ఈ వంతెనను నిర్మించారు. సముద్రం మీద 16.50 కిలోమీటర్లు, భూమిపై 5.5 కిలోమీటర్లు ఉంది. ఇది వినియోగంలోకి వస్తే రెండు గంటల ప్రయాణం కాస్తా 20 నిమిషాల్లోనే పూర్తి కానుంది. మల్టీ-యాక్సిల్ భారీ వాహనాలు, ట్రక్కులు, బస్సులకు ఈ బ్రిడ్జిపై అనుమతి లేదు. ఈ వాహనాలు ముంబయి పోర్ట్-సివారీ ఎగ్జిట్ ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. మోటారు సైకిళ్లు, మోపెడ్‌లు, త్రీవీలర్లు, ఆటోలు, ట్రాక్టర్లు, జంతువులతో నడిచే వాహనాలు, నెమ్మదిగా వెళ్లే వాహనాలకు ప్రవేశం ఉండదని వెల్లడించారు.




దిల్లీ: ప్రపంచంలోనే 2024కిగానూ ఆరు దేశాల పాస్‌పోర్టులు అత్యంత శక్తిమంతమైనవిగా నిలిచాయి. వీటిలో ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, జపాన్, సింగపూర్ ఉన్నాయి. మంగళవారం విడుదలైన ‘హెన్లీ పాస్‌పోర్టు సూచీ’ నివేదికలో ఇవి తొలి స్థానంలో నిలిచాయి. 227 దేశాలతో కూడిన ఈ జాబితాలో భారత్ 80వ స్థానం దక్కించుకొంది. తొలి స్థానంలో నిలిచిన ఆరు దేశాల పాస్‌పోర్టులతో ఏకంగా 194 దేశాలకు ముందస్తు వీసా లేకుండానే ప్రయాణించొచ్చు. గత ఐదేళ్లుగా ఈ సూచీలో సింగపూర్, జపాన్ తొలిస్థానంలో నిలుస్తున్నాయి. ఈసారి అదనంగా మరో నాలుగు దేశాలు వాటి సరసన చేరాయి. రెండో స్థానంలో ఉన్న దక్షిణ కొరియా, ఫిన్లాండ్, స్వీడన్ దేశాల పాస్ట్‌పోర్టులతో 193 దేశాలకు సౌకర్యవంతంగా వెళ్లొచ్చు. ఆస్ట్రియా, డెన్మార్క్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ పాస్‌పోర్టులు మూడో స్థానంలో ఉన్నాయి. వీటితో 192 దేశాలకు వెళ్లేందుకు ముందస్తు వీసా అవసరంలేదు. 191 దేశాలకు ప్రయాణించే సౌకర్యం ఉన్న యూకే పాస్‌పోర్టు నాలుగో స్థానం దక్కించుకుంది. తాజా సూచీలో 80వ స్థానంలో ఉన్న భారత పాస్‌పోర్టుతో 62 దేశాలకు ప్రయాణించొచ్చు. గత ఏడాది 59 దేశాలు మాత్రమే ముందస్తు వీసా లేకుండా మన పాస్‌పోర్టుతో ప్రయాణించేందుకు అనుమతించాయి. దీంతో 2023లో మన దేశం ఈ జాబితాలో 85వ స్థానంలో నిలిచింది. ‘హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్’ ప్రకారం 2006లో భారత్ 71వ స్థానంలో ఉండేది. ఈసారి జాబితాలో అఫ్గానిస్థాన్ చివరి స్థానం(104)లో నిలిచింది. ఆ దేశ పాస్‌పోర్టుతో 28 దేశాలు మాత్రమే ఈ రకంగా అనుమతిస్తున్నాయి. దీని కంటే మూడు స్థానాలు మెరుగ్గా 101వ ర్యాంక్‌లో పాక్ పాస్‌పోర్టు ఉంది. దశాబ్ద కాలంలో యూఏఈ పాస్‌పోర్టు 55 నుంచి 11వ స్థానానికి ఎగబాకింది. ఉక్రెయిన్, చైనా 21 స్థానాలు మెరుగుపర్చుకున్నాయి. చైనా తాజాగా 62వ, ఉక్రెయిన్ పాస్‌పోర్టు 32వ స్థానంలో నిలిచింది. రష్యా పదేళ్లలో 24 స్థానాలు ఎగబాకి ఈసారి 51వ ర్యాంక్‌కు చేరింది. ఆ దేశ పాస్‌పోర్టుతో 119 దేశాలకు ముందస్తు వీసా లేకుండా వెళ్లొచ్చు.

## వైసీపీకి మరో షాక్.. తిరువూరు ఎమ్మెల్యే రాజీనామా!



ఎన్టీఆర్ జిల్లా: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగలనుంది. తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిది పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తిరువూరు వైసీపీ సీటు తనకి రాదని సమాచారం రావటంతో మనస్తాపం చెందిన రక్షణ నిది ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలియవచ్చింది. స్వామిదాస్‌కు తిరువూరు వైసీపీ తరపున టికెట్ ఇస్తే పార్టీమారే యోచనలో ఆయన ఉన్నారు. శుక్రవారం తిరువూరు వచ్చి రక్షణ నిది తన నిర్ణయం ప్రకటిస్తారని సమాచారం. ఎమ్మెల్యే రక్షణ నిది గత 15 రోజులుగా తిరువూరు రాకుండా వల్లూరుపాలెంలోనే మకాం వేశారు.

రక్షణ నిదితో పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్‌లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. బుధవారం, ఈ రోజు ఉదయం కూడా రక్షణ నిదిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినా ససేమిరా అన్నారు. ఉమ్మడి కృష్ణ జిల్లా టీడీపీ నేతలు రక్షణ నిధితో రాయభారం చేసినట్లు సమాచారం. పార్థసారధి బాటలో వైసీపీని వీడి టీడీపీలో వచ్చేందుకు రెడీ అవుతున్నట్లు సామాజిక మధ్యమాల్లో వార్త హల్ చల్ చేస్తోంది.

# డబుల్ ఎక్స్‌ఎల్ అందాలు..!

మోడల్ గా కెరీర్ ను ఆరంభించిన హుమా ఖురేషి తక్కువ సమయంలోనే బాలీవుడ్ తో పాటు సౌత్ లో కూడా మంచి గుర్తింపును దక్కించుకుంది. అందమైన ఈ అమ్మడు కేవలం హీరోయిన్‌గానే కాకుండా వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్ ను సద్వినియోగం చేసుకుంటూ వచ్చింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు అయినా కూడా ఈ అమ్మడికి ఇంకా వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. బొద్దుగుమ్మ అంటూ చాలా మంది ఈ అమ్మడి అందం ను ఆరాధిస్తూ ఉంటారు. మరి కొందరు ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ఫిదా అవుతూ సోషల్ మీడియాలో తెగ కామెంట్స్ చేస్తూ ఉంటారు. తాజాగా ఈ డబుల్



ఎక్స్‌ఎల్ సినిమా హీరోయిన్ షేర్ చేసిన ఫోటోలు మరియు వీడియోలు అందరి దృష్టి ని ఆకర్షిస్తున్నాయి. అందమైన హుమా ఖురేషి అందాల ఆరబోత ఫోటోలు ఎప్పటిలాగే వైరల్ అవుతున్నాయి.

ఆకట్టుకునే అందం తో పాటు ఈమె ఎక్స్ ప్రెషన్స్ కూడా ఫోటోలో కవ్విస్తున్నాయి. విభిన్నమైన షాడోలో కనిపించి కనిపించకుండా అందంగా కనిపిస్తున్న హుమా ఖురేషి అందాల విందు కు ఎంతటి వారైనా కూడా అబ్బా అనాల్సిందే. ఇక ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే ఒక వైపు రెండు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు వెబ్ సిరీస్ ల్లో కూడా నటిస్తూ బిజీగా ఉంది.

## ఇన్నాళ్లకు అది బయట పెట్టిన ఇల్లి బేబ్..!

ఒకప్పటి టాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఇలియానా అప్పటి స్టార్స్ అందరితో నటించి మెప్పించింది. పోకిరి, మున్నా, శక్తి ఈ సినిమాల టైం లో ఇలియానాకు ఒక సెపరేట్ ఫ్యాన్స్ ఉండేవారు. స్లిం లుక్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను కాజేసింది అమ్మడు. అయితే సౌత్ లో కెరీర్ పీక్స్ లో ఉన్న టైం లో నార్త్ నుంచి ఆఫర్ రాగానే అక్కడకు షిఫ్ట్ అయ్యింది. బాలీవుడ్ లో ఆశించిన స్థాయి క్రేజ్ తెచ్చుకోవడంలో విఫలమైన ఇలియానా ఆ తర్వాత పెద్దగా సినిమా ఛాన్స్ లను అందుకోలేదు. సౌత్ సినిమాలకు దూరమైన ఈ అమ్మడు ఇక్కడ కూడా అవకాశాలు రాబట్టుకోలేదు. ఇక ఇదే టైం లో తన పర్సనల్ లైఫ్ మీద దృష్టి పెట్టిన ఇలియానా కొన్నాళ్లు ఒకరితో ప్రేమాయణం నడిపించి అతనికి దూరమైంది. ఆ తర్వాత ఏకంగా ప్రెగ్నెన్సీ తో షాక్ ఇచ్చింది. ప్రెగ్నెన్సీ ఫోటోలను షేర్ చేస్తూ తన ఆనందాన్ని పంచుకున్న ఇలియానా భర్త గురించి మాత్రం వివరాలను



వెల్లడించలేదు. లాస్ట్ ఇయర్ ఇలియానా ఒక బాబుకి జన్మనిచ్చింది. కొడుకు పేరు కోవా ఫీనిక్స్ డోలన్ అని కూడా అనౌన్స్ చేసింది. బాబుతో తన లైఫ్ చాలా అందంగా ఉందంటూ తన అప్డేట్స్ తో సోషల్ మీడియా ఫ్యాన్స్ ని అలరిస్తుంది ఇలియానా. అయితే తన భర్త గురించి మాత్రం ఇప్పటికీ సీక్రెట్ గా ఉంచుతుంది. రీసెంట్ గా తన భర్త ఫోటోలను షేర్ చేస్తూ అతడి పేరుని మైఖెల్ డోలన్ అని చెప్పింది. పేరు చెప్పింది కానీ ఆ తర్వాత అతని గురించి మిగతా డీటైల్స్ చెప్పలేదు. లేటెస్ట్ గా ఇలియానా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన భర్త గురించి అతని పై కొందరు చేసిన కామెంట్స్ గురించి ప్రస్తావించింది ఇలియానా. తన జీవితంలోకి మైఖెల్ వచ్చినందుకు తాను ఎప్పుడూ సంతోషంగా ఉన్నాను.. అతను ఒక అద్భుతమైన భాగస్వామి అని చెప్పుకొచ్చింది ఇలియానా. ఆఫ్టర్ డెలివరీ డిప్రెషన్ ఉంటుంది. అది ఏంటన్నది తనకు అప్పుడు అర్థమైంది. ఆ టైం లో తన ఇంట్లో వారు మంచి సపోర్ట్ గా నిలిచారని చెప్పింది ఇలియానా. డాక్టర్స్ కూడా తనని బాబుని బాగా చూసుకున్నారని అన్నది ఇలియానా. ఆ టైం లో మైఖెల్ తనకు తోడుగా ఉన్నాడు. బాబుని తనే జాగ్రత్తగా చూసుకున్నాడని అన్నది ఇలియానా. నా జీవితంలోకి మైఖెల్ రావడం ఒక అదృష్టం. తను నాకోసం ఏమి చెప్పకుండానే అన్నీ చేస్తాడు. తను ఒక అద్భుతమైన భాగస్వామి అని అందుకు తాను కృతజ్ఞురాలిని అంటూ చెప్పుకొచ్చింది ఇలియానా. తన భర్త గురించి జనాలు చాలా చెడుగా మాట్లాడారు. మైఖెల్ ని మ్యారేజ్ చేసుకున్నారా ఇలాంటివన్ని తనని బాధ పెట్టాయని.. భర్త, పెళ్లి గురించి అన్ని విషయాలు చెప్పాలని ఉన్నా తనకు నచ్చిన వారి గురించి అందరు ఇలా చెడుగా మాట్లాడటం తనకు నచ్చలేదని మైఖెల్ మీద తన ప్రేమను చూపిస్తూ ఎమోషనల్ అయ్యింది ఇలియానా.




# నిర్మాతగా హీరోయిన్ చాలా కాన్ఫిడెన్స్ తోనే!



ఇటీవలే తాప్సీ పన్ను నిర్మాతగా తన అనుభవాన్ని రివీల్ చేసిన సంగతి తెలిసిందే. చిన్న సినిమాలు ఓటీటీలో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కుంటున్నాయి? అవి థియేటర్ వరకూ వెళ్లాలంటే ఎలాంటి సవాళ్లు ఎదుర్కువాల్సి ఉంటుంది? వాటిలో లాభనష్టాల గురించి తను స్వీయా అనుభవాలు చెప్పుకొచ్చింది. స్టార్స్ ఉన్న సినిమాలకు మార్కెట్ లో డిమాండ్ ఎలా ఉంటుంది? స్టార్స్ లేకున్నా కంటెంట్ ఉన్నా? ఎలాంటి సవాళ్లు ఎదుర్కోవాలి అన్నది పూస గుచ్చినట్లు మరీ వివరించింది. 'థక్ థక్' అనే చిత్రాన్ని తాప్సీ స్వయంగా నిర్మించి రిలీజ్ చేయడంతోనే ఈ అనుభవం సాధ్యమైంది. తాజాగా 'దో పత్తి' సినిమాతో కృతి సనన్ కూడా నిర్మాణ రంగంలోకి అడుగు పెడుతున్న సంగతి తెలిసిందే. బ్లూ బటర్ ఫ్లై అనే సంస్థని నిర్మించి దోపత్తిని నిర్మించింది. ఈ నేపథ్యంలో రిలీజ్ కి ముందు తన ధీమాని వ్యక్తం చేసింది.' థియేటర్లు..ఓటీటీలకు కావాల్సింది మంచి కంటెంట్ మాత్రమే. నటీనటులుగా ఏ సినిమా చేసినా ఆ పాత్రలో ఒదిగిపోతాం. కానీ దోపత్తీ ప్రయాణంలో ముఖ్య పాత్ర పోషిస్తూ స్టోరీ దగ్గర నుంచి ప్రతీ విషయం లోనూ భాగమయ్యాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. సినిమా థియేటర్లో రిలీజ్ అయినా.. ఓటీటీ లో రిలీజ్ అయినా బాగుంటే ఎక్కడైనా ఆదరణ దక్కుతుంది. రెండింటికీ కావాల్సింది కేవలం కంటెంట్ మాత్రమే. లార్జర్ దేన్ లైఫ్ కథల్నే ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు' అని అంది. దో పత్తీ కాజోల్ ప్రధాన పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇది నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కి రెడీ అవుతోంది. ఇక కృతి సనన్ హీరోయిన్ గా టాలీవుడ్ కి సుపరిచితమే. అమ్మడు కెరీర్ వన్ సినిమాతో ఇక్కడే ప్రారంభమైంది. అటుపై రెండు..మూడు సినిమాలు చేసి బాలీవుడ్ కి వెళ్లిపోయింది. అక్కడ మాత్రం స్టార్ హీరోయిన్ గా వెలుగిపోతుంది. జాతీయ ఉత్తమ నటిగాను గతేడాది ఎంపికైన సంగతి తెలిసిందే.

# నవదీప్ 2.0కి మాస్ మహారాజ్ మద్దతు




నవదీప్ కొంత విరామం తర్వాత 'లవ్ మౌళి'గా ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఈ చిత్రానికి అవనీంద్ర దర్శకుడు. నైరా క్రియేషన్స్ – శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన నవదీప్ లుక్‌తో పాటు 'ద యాంథమ్ ఆఫ్ లవ్ మౌళి' సాంగ్ మంచి స్పందనను రాబట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ వీడియోలో కంటెంట్‌లో నవదీప్ డిఫరెంట్‌గా కనిపించడంతో నవదీప్ 2.%వా%గా అభిమానులు వర్ణిస్తున్నారు.

తాజాగా ఈ చిత్ర ఆడియో జూక్ బాక్స్ ని మాస్ మహారాజా రవితేజ విడుదల చేసి చిత్రయూనిట్‌కు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ ఈవెంట్‌లో పాటలను వినూత్నంగా విడుదల చేశారు. ఈ సినిమాలోని పాటలను ఎవరైతే పాడారో.. వారితోనే ఆ పాటను ఈ ఈవెంట్‌లో పాడించి.. అదే పాటను వారిచేతే విడుదల చేయించారు. అనంతరం పాటలన్నీ కలిపి ఉన్న జూక్‌బాక్స్‌ని స్టార్ హీరో రవితేజ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. రవితేజ నటించిన 'ఈగల్' చిత్రంలో నవదీప్ ఓ కీలక పాత్రలో నటించిన విషయం తెలిసిందే. 'ఈగల్' ట్రైలర్ చూస్తుంటే.. నవదీప్ పాత్రకు ఈ చిత్రంలో చాలా ప్రాముఖ్యత ఉందనేది అర్థమవుతోంది. 'లవ్ మౌళి' సినిమాలోని పాటలను ఇలా వినూత్నంగా విడుదల చేయడం.. అలాగే మాస్ రాజా రవితేజగారు జూక్ బాక్స్ విడుదల చేయడం చాలా సంతోషాన్నిచ్చిందని హీరో నవదీప్ అన్నారు. నా ఆలోచన విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు 'లవ్, మౌళి' దగ్గరగా అనిపించింది. అందుకే మీ ముందుకు సరికొత్త చిత్రంతో రాబోతున్నానని నవదీప్ తెలిపారు. ఇంకా ఈ చిత్రానికి పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. నవదీప్, పంఖురి గిద్వానీ, భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి బ్యానర్లు: నైరా క్రియేషన్స్ అండ్ శ్రీకర స్టూడియోస్. గోవింద్ వసంత సంగీతం అందించారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. రచన, దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్: అవనీంద్ర.

# 'కనా' కి ఛాన్స్ ఇచ్చిన లేడీ సూపర్ స్టార్!

లేడీ సూపర్ స్టార్ నయనతార జవాన్ సినిమా తర్వాత బాలీవుడ్ లోనూ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకుంది. అయితే హిందీలో కంటే సౌత్ లో అది కాకుండా తమిళ్ లోనే ఎక్కువ సినిమాలు చేయాలనే ఉద్దేశ్యంతో నయనతార ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తన భర్త విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఒక సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న నయనతార, మరో రెండు సినిమాల్లో కూడా నటిస్తోంది. అందులో ఒకటి నయన్ 75వ సినిమా అవ్వడం విశేషం. మొత్తంగా మూడు సినిమాలకు కమిట్ అయ్యి ఇప్పటికే షూటింగ్ దశలో ఉన్నాయి. మూడు సినిమాలు షూటింగ్ దశలో ఉండగానే కొత్త సినిమాకు సంబంధించిన చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతోంది. ఐశ్వర్య రాజేష్ తో కనా



అనే సినిమాను రూపొందించి విజయాన్ని సొంతం చేసుకున్న దర్శకుడు అరుణ్ రాజా కామరాజ్ దర్శకత్వంలో నయన్ ఒక సినిమా చేయబోతుంది. ఇటీవల ఉదయనిధి స్టాలిన్ తో ఒక సినిమాను చేసిన అరుణ్ రాజా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. బ్యాక్ టు బ్యాక్ విజయాలు సొంతం చేసుకున్న ఈ దర్శకుడితో నయనతార వర్క్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక లేడీ ఓరియంటెడ్ స్క్రిప్ట్ రెడీ అయ్యిందని తెలుస్తోంది. విభిన్న చిత్రాలు చేసుకుంటూ కెరీర్ లో ముందుకు సాగుతున్న అన్నపూరణి సినిమా తో నయన్ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఫలితం విషయం అటుంచి, ఆ సినిమాలో ఈ అమ్మడి నటనకు మంచి మార్కులు పడుతున్నాయి.

## గోల్డెన్ టాప్ లో కన్నడ అందం.. గ్లామర్ షోలో తగ్గేదేలే

టాలీవుడ్ యంగ్ హీరోయిన్లలో గ్లామర్ పరంగా నభా నటేష్ ముందు వరుసలో ఉంటుంది. నాజూకైన సొగసుతో కుర్రకారుకు అందాల వల వేస్తోంది నభా. ముఖ్యంగా ఆమె నడుము అందాలు కుర్రాళ్ల మతులు పోగొట్టే విధంగా ఉంటాయి. అందం అంటే ఇలా ఉండాలి అనిపించేలా ఆమె ఫిజిక్ ఉంటుంది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత నభా నటించిన సోలో బ్రతుకే సో బెటర్ విజయం సాధించింది. అల్లుడు అదుర్స్ చిత్రం నిరాశపరిచింది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత నభా మరో బిగ్ హిట్ కోసం ఎదురుచూస్తోంది. ఆ తరహాలో నభా కు మరో భారీ హిట్ పడితే స్టార్ లీగ్ లోకి ఎంటర్ కావడం ఖాయం. ఆ మధ్యన సోషల్ మీడియాలో సైలెంట్ గా ఉన్న నభా నటేష్ తిరిగి ఇంటెన్సిటీ పెంచింది. తాజాగా నభా నటేష్ షేర్ చేసిన ఫోటోలు



చూస్తే కుర్ర హృదయాలు చెల్లాచెదురు కావాల్సిందే. గోల్డ్ కలర్ డ్రెస్ లో నభా నటేష్ కొంటెగా చూస్తూ హీట్ పుట్టిస్తోంది. ఆమె ఇస్తున్న ఫోజులు అదిరిపోయాయి. పెదవులు, నడుము సొగసుతో కుర్రకారు మతి పోగొడుతోంది. క్లీ వేజ్ షో తో డిఫరెంట్ ఔట్ ఫిట్ లో ఈ అమ్మడి అందాల ఆరబోతకు ఎంతటి వారైనా ఫిదా అవ్వడం పక్కా. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. కామెంట్ల బాక్స్ నింపేస్తున్నారు. ఇంతటి అందం కలిగి ఉన్న ఈ అమ్మడికి పాపం ఎందుకు సినిమాల్లో ఎక్కువగా ఆఫర్లు రావడం లేదో అర్థం కావడం లేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కసిగా చూస్తూ కళ్లు చెదిరే ఫోజులు ఇవ్వడంలో తనకు తానే సాటి అని నభా మరోసారి నిరూపించుకుంది. ప్రస్తుతం మరిన్ని ఆఫర్స్ కోసం ఎదురుచూస్తోందీ ఈ అమ్మడు. మ్యాస్ట్రో తర్వాత నభా నటేష్ ఒక్క చిత్రంలోనూ నటించలేదు. గత రెండేళ్లుగా ఆమె ఖాళీగానే ఉంది. ఆమె క్యాలెండర్ లో 2022, 2023 ఖాళీ అనే చెప్పాలి. ఈ ఏడాది అయినా ఆమెకు ఆఫర్స్ వస్తాయేమో చూడాలి. అయితే నభా.. ఎన్టీఆర్, కొరటాల శివ సినిమాలో రెండో హీరోయిన్‌గా నటించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వాటితో పాటు ప్రభాస్ రాజా డీలక్స్, రామ్ చరణ్ నెక్స్ట్ ప్రాజెక్ట్‌లో ఈ భామను తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట. త్వరలో ఈ విషయమై అధికారిక ప్రకటన వస్తుందట.



# రహదారి భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రహదారి భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై గూగుల్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించారు. గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట.. మర్యాదపూర్వకంగా సీఎంను కలిశారు. గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ ప్లాట్‌ఫాంల వినియోగంపై చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించిన చంద్రశేఖర్.. ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఏఐ ప్రతీ రంగాన్ని ప్రభావితం చేస్తోందన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో డిజిటలీకరణ అజెండాను అభివృద్ధి చేసేందుకు ఆయన ఆసక్తి చూపారు. రాష్ట్ర ప్రజల అవసరాల కోసం నాణ్యమైన సేవలు అందించేందుకు కావాల్సిన సాంకేతికత, నైపుణ్యాలు తమ వద్ద ఉన్నాయని సీఎంకు వివరించారు. సమావేశంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 14 నియోజకవర్గాల్లో 6 వేల ఓట్ల తేడాతో ఓడిపోయాం



హైదరాబాద్: తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తిరస్కరంచలేదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి మూడో వంతు సీట్లు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ మధ్య ఓట్ల తేడా 1.85 శాతం మాత్రమేనని వివరించారు. 14 నియోజవకర్గాల్లో 6 వేల ఓట్ల తేడాతో ఓడిపోయామని గుర్తుచేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు దగ్గర అయ్యేందుకు ప్రయత్నిస్తామని చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుబంద సంఘాలను మరింత బలోపేతం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ప్రజల్లోకి వెళ్లి మమేకం అవుతామని చెప్పారు. వచ్చే లోక్ సభ ఎన్నికల లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తుంది. జిల్లాలవారీగా సన్నాహాక సమావేశాలను నిర్వహిస్తుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తుంటి ఎముక విరగడంతో విశ్రాంతిలో ఉన్నారు. పార్టీలో అన్నీ తానై ముందుకు నడిపిస్తున్నారు కేటీఆర్ . క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లాలని శ్రేణులకు నిర్దేశిస్తున్నారు. జనంలో ఉంటేనే సమస్యలు తెలుస్తాయని హితోపదేశం చేస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో గతంలో కన్నా ఎక్కువ సీట్లను గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 సీట్లు గెలిచి ప్రతిపక్షానికి పరిమితం అయ్యింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తుంది. మరి ఆ పార్టీకి జనాధరణ లభిస్తుందో లేదో చూడాలి.

# తెలంగాణ నిరుద్యోగులకు గుడ్ న్యూస్



హైదరాబాద్, జనవరి 11: అధికారంలోకి వచ్చాక ఎన్నికల వేళ ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి ఓకే చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తర్వాత ఐదు గ్యారంటీల అమలుకు ముందడుగు వేసింది. ప్రజాపాలన – అభయహస్తం పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఇప్పుడు తాజాగా తెలంగాణలో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. ఫిబ్రవరిలోనే ఉద్యోగాల నియామకాలు మొదలు పెడుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. దీంతో ఉద్యోగ నోటిఫికేషన్ కోసం లక్షలాది విద్యార్థులు ఎదురుచూస్తున్న పరిస్థితి. టీఎస్పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామా ఆమోదంతో ఉద్యోగాల నియామకాలకు అడ్డంకులు తొలగిపోయాయి. అతి త్వరలో టీఎస్పీఎస్సీ బోర్డు ఛైర్మన్, సభ్యులను సర్కార్ నియమించనుంది. ఛైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ లేదా ఐపీఎస్ ఆఫీసర్‌ను నియమించే అవకాశం ఉంది.

**ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్?..** ఇటీవలే యూపీఎస్సీ ఛైర్మన్‌ను సీఎం రేవంత్ కలిసిన విషయం తెలిసిందే. పారదర్శకంగా బోర్డు ఉండేలా కసరత్తు చేపట్టారు. ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. టీఎస్పీఎస్సీ బోర్డులో ఛైర్మన్‌తో పాటు 10 మంది సభ్యులు ఉండనున్నారు. బోర్డులో ఉండాల్సిన నిపుణుల కోసం ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. సీఎం విదేశీ పర్యటన తర్వాత కొత్త బోర్డు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది.

# సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే నా రాజకీయ లక్ష్యం: మంత్రి తుమ్మల



సత్తుపల్లి: సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే తన రాజకీయ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాకులకుంట వద్ద సీతారామ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న టన్నెల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామల మవుతుందన్నారు. వీలైనంత తొందరగా ప్రాజెక్టును పూర్తిచేసి ఉమ్మడి జిల్లాలో పది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని చెప్పారు. ప్రాజెక్టులో యాతాలకుంట టన్నెల్ ప్రధానమైనదని, పనులు రెండు వైపుల నుంచి చేసుకుంటూ రావాలన్నారు. సీతారామ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై ఈ నెల 8న హైదరాబాద్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి నీటి పారుదలశాఖ అధికారులతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే నెలాఖరు కల్లా సీతారామ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని కాలువల పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల్లో వేగం పెంచితే ఈ ఏడాదిలోనే వైరా రిజర్వాయర్, లంకాసాగర్ చెరువు, ఎన్నెస్పీ ఆయకట్టులోని సుమారు 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఏనూరు వద్ద లింకు కెనాల్ పనులకు టెండర్లు పూర్తి చేసి, పనులు మొదలుపెట్టాలన్నారు. యాతాలకుంటలో భూసేకరణ పూర్తయితే సత్తుపల్లి టన్నెల్ ద్వారా లంకసాగర్, బేతుపల్లి కెనాల్‌కు ఈ సీజన్‌లో సాగునీరు ఇవ్వొచ్చన్నారు. సత్తుపల్లి కెనాల్‌కు సంబంధించి భూసేకరణకు రూ.12 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాలేరు టన్నెల్ పనులనూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయితే పాలేరు రిజర్వాయర్‌కూ జలాలు తీసుకురావొచ్చన్నారు.

# ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల




హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు తాజాగా నోటిఫికేషన్ విడుదల అయ్యింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను అసెంబ్లీ కార్యాలయం విడుదల చేసింది. కాగా, రెండు సీట్లకూ విడివిడిగానే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ కార్యాలయం వేర్వేరుగానే నోటిఫికేషన్లను జారీ చేసింది. నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని అందులో పేర్కొంది. ఈ నెల 18 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 22 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈ నెల 29న పోలింగ్ జరగనుంది. అదేరోజున ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో వారు తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంతో రెండు స్థానాలకు ఎన్నికల కమిషన్ ఉపఎన్నికలు నిర్వహిస్తున్నది. అయితే రెండు స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తుండటంతో సంఖ్యాబలం దృష్ట్యా అధికార కాంగ్రెస్ పార్టీకే ఆ సీట్లు దక్కనున్నాయి.




న్యూయార్క్: ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్' నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు తమ దేశంలో కుట్ర జరిగిందంటూ అమెరికా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా అనే వ్యక్తి ప్రమేయం ఉందన్న అగ్రరాజ్యం.. అతడిపై నేరాభియోగాలను నమోదు చేసింది. దీంతో గుప్తా న్యాయవాది ఇటీవల న్యూయార్క్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసుకు సంబంధించిన ఆధారాలివ్వాలని కోరారు. అయితే, ఇందుకు అమెరికా ప్రభుత్వం నిరాకరించింది. నిఖిల్ గుప్తాను గతేడాది జూన్‌లో చెక్ రిపబ్లిక్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ప్రాగ్ జైల్లో ఉన్న అతడిని ఆధీనంలోకి తీసుకోవడం కోసం అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే జనవరి 4న గుప్తా తరఫు న్యాయవాది.. న్యూయార్క్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. "ఈ కేసులో అతడిపై నేరాభియోగాలు మోపిన అమెరికా.. ఆధారాలు, ఆరోపణలను బలపర్చే పత్రాలను అందజేయలేదు. న్యాయవాదులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే.. జైల్లో అతడిని అగ్రరాజ్య అధికారులు పలుమార్లు ప్రశ్నించారు. ఈ కేసులో అతడు విచారణ ఎదుర్కోవాలంటే ముందు కేసుకు సంబంధించిన వివరాలను అందజేయాలి" అని గుప్తా న్యాయవాది అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. స్పందన తెలియజేయాలంటూ అమెరికా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే బుధవారం ఫెడరల్ ప్రాసిక్యూటర్లు కోర్టుకు తమ సమాధానం తెలియజేశారు. గుప్తా అభ్యర్థనను తాము వ్యతిరేకిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ కేసులో గుప్తా.. న్యూయార్క్ కోర్టులో హాజరైనప్పుడు మాత్రమే తాము ఆధారాలను అందజేస్తామన్నారు. గుప్తా న్యాయవాది ఆరోపణలను ప్రభుత్వం తోసిపుచ్చింది. "ప్రాగ్ జైల్లో నిందితుడిని అమెరికా దర్యాప్తు అధికారులు కేవలం రెండు సార్లు మాత్రమే కలిశారు. ఆ సందర్భాల్లోనూ అతడి హక్కులను ఉల్లంఘించలేదు. న్యాయవాదుల సమక్షంలోనే అతడిని ప్రశ్నించారు" అని యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు తమ స్పందనలో తెలియజేశారు. పన్నూ హత్య కుట్రను అగ్రరాజ్యం భగ్నం చేసిందని, ఈ విషయాన్ని అమెరికా అధికారులు భారత ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినట్లు గతంలో అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఓ భారత అధికారితో కలిసి నిఖిల్ గుప్తా ఈ కుట్ర పన్నినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం దీనిపై అమెరికా ఎఫ్‌బీఐ దర్యాప్తు చేస్తోంది. మరోవైపు, ఈ ఆరోపణలపై దర్యాప్తునకు భారత్ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసింది.




# కేటీఆర్ వ్యాఖ్యలపై బండి సంజయ్ ఆగ్రహం

కరీంనగర్: తెలంగాణ కోసం కేసీఆర్ రక్తం చిందించారన్న మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ఒంట్లో ఉన్నదంతా మద్యమేనని.. రక్తం కాదని.. ప్రజల రక్తాన్ని పీల్చుకు తిన్న రాబందు కేసీఆర్ అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సమస్యలపై పోరాటం చేసిన వారిని రక్తం కారేలా కొట్టలేదా? అని ప్రశ్నించారు. ప్రజలను దోచుకుతిన్న విషయాన్ని మర్చిపోయి కేటీఆర్ మాట్లాడుతున్నారని, కేసీఆర్ కుటుంబం దోచుకోని రంగం ఏదైనా ఉందా? అని నిలదీశారు. బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేటీఆర్‌ను బొక్కలో వేసేవాళ్లమన్నారు. కేసీఆర్ కొడుకు..ఇంకా అధికారంలోనే ఉన్నామని అనుకుంటున్నారని, కేటీఆర్ అహం ఇంకా దిగలేదని బండి సంజయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**నిన్న కేటీఆర్ వ్యాఖ్యలు..** గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి కేసీఆర్ కష్టపడినంతగా దేశంలో ఎవరూ కష్టపడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ తన రక్తాన్ని రంగరించి, చెమటను ధార పోశారని చెప్పారు. రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 99 శాతం సమయాన్ని పాలనకే కేటాయించారని తెలిపారు. అధికారంలో ఉన్నపుడు పాలనపై పూర్తిగా దృష్టిపెట్టడంతో పార్టీకి తక్కువ సమయం కేటాయించాల్సి వచ్చిందన్నారు. ఇకపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకుని పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తామని చెప్పారు. పార్టీని ఏక తాటిపైకి తెచ్చేందుకు నాయకులు, ముఖ్య కార్యకర్తలకు త్వరలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీ శ్రేణులు ఎవరైనా తెలంగాణ భవన్‌కు రావొచ్చని, తనతోపాటు సీనియర్ నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో బీఆర్ఎస్ సీనియర్ నేతలు పోచారం శ్రీనివాసరెడ్డి, మధుసూదనాచారి, కడియం శ్రీహరి, బండ ప్రకాశ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వానికి వంద రోజుల సమయం ఇద్దామనుకున్నాం. వారేమో ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునేందుకు గవర్నర్ ప్రసంగం, శ్వేత పత్రాల ద్వారా కేసీఆర్ ప్రభుత్వాన్ని నిందించే ప్రయత్నం మొదలు పెట్టారు. అబద్ధాలు చెప్పి తప్పించుకోవాలని చూస్తే ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తాం. ప్రజలను వంచించాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి అసలు సినిమా ముందుంది" అని కేటీఆర్ అన్నారు.

**లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీ బలోపేతం..** ఎన్నికల వరకు ప్రజలు తమతోనే ఉన్నారనే ధీమాలో ఉన్నామని, ఉద్యమాల గడ్డ అయిన వరంగల్ జిల్లాలోనూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే బీఆర్ఎస్ నేతలు ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందని కేటీఆర్ అన్నారు. జయశంకర్ సార్ పుట్టిన నేల అయిన వరంగల్‌లో 2014, 2019లో ఎంపీ సీటును బీఆర్ఎస్ గెలిచిందని, ఈసారి కూడా గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. లోపాలను సమీక్షించుకుని, పార్లమెంటు ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారంటీలు కాదని, 420 హామీలనే విషయాన్ని కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేస్తూనే ఉండాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను రాజకీయ అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోందని, వాటిపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోందని చెప్పారు. పేదల గొంతుకకు బీఆర్ఎస్ అండగా ఉండాలన్నారు. జిల్లాలను రద్దు చేస్తామని సీఎం రేవంత్ అవగాహన లేకుండా చెబుతున్నారని, అలా చేస్తే ప్రజలు ఊరుకోరని అన్నారు. నెల రోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మొదలైందని కేటీఆర్ వెల్లడించారు.

**కేసులకు భయపడొద్దు..** అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ తప్పుడు కేసులు పెడుతోందని, వాటికి భయపడాల్సిన పని లేదని, బీఆర్ఎసకు పటిష్ఠమైన లీగల్ సెల్ ఉందని నాయకులు, కార్యక్తలకు కేటీఆర్ తెలిపారు. కేసులు పెడితే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు సకాలంలో స్పందించి పోరాడాలన్నారు. కేసుల తీవ్రతను బట్టి రాష్ట్ర నాయకత్వం స్పందిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్‌ను ఉఫ్‌మని ఊదేస్తామని కొందరు నాయకులు అంటున్నారని.. 29 ఏళ్లుగా ఎంతో మంది అలా ప్రయత్నించి విఫలమయ్యారని చెప్పారు. బీఆర్ఎస్‌లో ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు అందరూ ఉన్నారని, ఈ పార్టీని లేకుండా చేయడం ఎవరి తరం కాదని కేటీఆర్ అన్నారు.




ధన్‌బాద్: జార్ఖండ్‌కు చెందిన 85 ఏళ్ల సరస్వతి దేవి అగర్వాల్ కల నెరవేరబోతున్నది. దాదాపు 30 ఏళ్ల తర్వాత ఆమె తన మౌన వ్రతాన్ని వీడనున్నారు. అయోధ్యలో రాముడికి ప్రాణ ప్రతిష్ట జరిగిన రోజే తాను మౌన వ్రతాన్ని వీడనున్నట్లు 1992లో ఆమె ప్రతిజ్ఞ చేశారు. ఇప్పుడు జనవరి 22వ తేదీన జరగనున్న ప్రాణ ప్రతిష్ట కోసం ఆమెకు ఆహ్వానం అందింది. ఇప్పుడు ఆమె కలనెరవేరబోతున్నది. జార?ండ్‌లోని ధన్‌బాద్‌కు చెందిన ఆ మహిళ.. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన రోజునే మౌన ముద్రలోకి వెళ్లింది. అయోధ్యలో రామాలయం కట్టిన రోజునే తన మౌన వ్రతాన్ని వీడనున్నట్లు ఆమె ఆ రోజున ప్రతిజ్ఞ పూనారు. మౌని మాతగా పేరు గాంచిన సరస్వతీ దేవి తమ కుటుంబ సభ్యులతో కేవలం సంకేతాలలో కమ్యూనికేట్ అయ్యేది. కొన్ని సందర్భాల్లో ఆమె పేపర్‌పై భారీ వ్యాఖ్యలు రాసి ఇచ్చేది. అయితే 2020 వరకు ఆమె ప్రతి రోజు కేవలం గంట మాత్రమే మాట్లాడాది. 24 గంటల్లో కేవలం మధ్యాహ్నం ఒక గంట మాత్రమే ఇంట్లోవాళ్లతో మాట్లాడేది. అయితే 2020లో ప్రధాని మోదీ.. అయోధ్య మందిరం కోసం శంకుస్థాపన చేసిన నాటి నుంచి ఆమె రోజంతా మౌనంగా ఉండడం ప్రారంభించింది. సోమవారమే ఆమె అయోధ్యకు రైలులో వెళ్లినట్లు ఆమె కుమారుడు 55 ఏళ్ల హరే రామ్ అగర్వాల్ తెలిపారు. జనవరి 22వ తేదీన ఆమె తన మౌనవ్రతాన్ని వీడుతారని ఆయన చెప్పారు. మహంత్ నృత్య గోపాల్ దాస్ సేవకుల తన తల్లికి ఆహ్వానం పలికినట్లు కుమారుడు తెలిపారు. 1986లో భర్త దేవకీనందన్ అగర్వాల్ మృతి తర్వాత సరస్వతీ దేవి తన జీవితాన్ని రాముడికి అంకితం చేసింది. ఎక్కువ సమయాన్ని ఆమె యాత్రలకే కేటాయించినట్లు హరే రామ్ తెలిపారు. రెండో కుమారుడు నంద్ లాల్ అగర్వాల్ వద్ద ప్రస్తుతం సరస్వతి ఉంటోంది. 2001లో మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటలో సుమారు ఏడు నెలల పాటు సరస్వతీ దేవి దీక్ష చేసినట్లు ఆమె కోడలు ఇన్నూ అగర్వాల్ తెలిపారు. సరస్వతీ దేవి తెల్లవారుజామున 4 గంటలకే నిద్ర లేస్తుంది. సుమారు ఆరేడు గంటల పాటు ధ్యానం చేస్తుంది. సంధ్యా ఆరతి తర్వాత రామాయణం, భగవద్గీత లాంటి పుస్తకాలను చదువుతుంది. ఆమె రోజు కేవలం ఒక్కసారి మాత్రమే భోజనం చేస్తుందని, ఇక సాయంత్రం, ఉదయం గ్లాసు పాలు తాగుతుందని ఇన్నూ అగర్వాల్ చెప్పింది. అన్నం, పప్పు, రోటీలతో కూడిన వెజ్ డైట్‌ను ఆమె తీసుకుంటుంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com